RNI NO.APTEL/2006/18110

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....

# ప్రజాగళం

తెలుగు దినపత్రిక

నిజామాబాద్ | సంపుటి : 20 | సంచిక : 285 | పబ్లిషర్ : కొక్కు రవికుమార్ | బుధవారం 2 - 9 - 2026 | పేజీలు : 4 | వెల : రూ. 1 - 00

## సికింద్రాబాద్‌లో కలకలం..

### మద్రాస్ రెజిమెంట్‌లో భారీగా ఆయుధాల చోరీ!


మద్రాస్ రెజిమెంట్‌లో భారీగా ఆయుధాలు చోరీ కావడం తీవ్ర కలకలం రేపుతోంది. రెజిమెంట్‌లోని ఓ గది తాళం పగులగొట్టి 12 అత్యాధునిక ఆయుధాలను దుండగులు ఎత్తుకెళ్లినట్లు తెలుస్తోంది. వీటిలో నాలుగు ఏకే-47 రైఫిళ్లు, ఆరు పిస్టల్స్, ఒక ఇన్సాస్ రైఫిల్ ఉన్నట్లు సమాచారం. అంతేకాకుండా పెద్ద మొత్తంలో మందుగుండు సామగ్రి కూడా మాయమైనట్లు గుర్తించారు. ఆర్మీ అధికారి ఫిర్యాదు మేరకు బొల్లారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

## ఏసీ బస్సుల్లోనూ మహిళలకు ఉచిత ప్రయాణం : చంద్రబాబు

**అమరావతి,సెప్టెంబర్,01:** ఆంధ్రప్రదేశ్ మహిళలకు ముఖ్యమంత్రి చంద్రబాబు తీపి కబురు అందించారు. రాష్ట్రంలో త్వరలో పెద్ద ఎత్తున అందుబాటులోకి రానున్న ఏసీబస్సుల్లోనూ మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు ఆయన వెల్లడించారు. మొగల్తూరులో నిర్వహించిన 'ఎన్టీఆర్ భరోసా'సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ముఖ్యమంత్రి ఈ కీలక ప్రకటన చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంవేగంగా అభివృద్ధి పథంలో పయనిస్తోందని పేర్కొన్నారు.

## 'తుమ్మిడిహెట్టి'పై ముగిసిన సిడబ్ల్యుసీ సమావేశం..

# 152 మీటర్ల ఎత్తుపై తెలంగాణ పట్టు'




**న్యూఢిల్లీ,సెప్టెంబర్,01:**
ప్రాణహిత నదిపై నిర్మించతలపెట్టిన తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణం, సాంకేతిక అంశాలు, అంతర్రాష్ట్ర జల వివాదాలపై కేంద్ర జలసంఘం ఆధ్వర్యంలో ఢిల్లీలోని సేవా భవన్‌లో జరిగిన ఉన్నత స్థాయి సమావేశం ముగిసింది. కేంద్ర జలసంఘం చైర్మన్ అనుపమ్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి తెలంగాణ, మహారాష్ట్ర జలవనరుల శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ భేటీలో ప్రధానంగా ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణం, రూపకల్పనపై ఇరు రాష్ట్రాల జలవనరుల శాఖ అధికారులతో సీడబ్ల్యూసీ సుదీర్ఘంగా చర్చించింది. గతంలో ఉన్న సాంకేతిక చిక్కుముడులను పరిష్కరించి ప్రాజెక్టును త్వరగా పట్టాలెక్కించేందుకు సీడబ్ల్యూసీ మీడియేటర్‌గా వేదికను ఏర్పాటు చేసింది. అయితే, గతంలో మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిన 148 మీటర్ల ఎత్తు కాకుండా, ప్రాజెక్టును 152 మీటర్ల ఎత్తుతో నిర్మించాలని తెలంగాణ ప్రభుత్వం ప్రధానంగా డిమాండ్ చేసింది.
148 మీటర్ల వద్ద నీటిని తరలిస్తే గ్రావిటీ ద్వారా సాగునీరు ముందుకు పారదని, పంపింగ్ కోసం ప్రతి ఏటా భారీగా విద్యుత్ ఖర్చు భరించాల్సి వస్తుందని తెలంగాణ అధికారులు స్పష్టం చేశారు.
ఒకవేళ ప్రాజెక్టును 152 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మిస్తేనే విద్యుత్ భారం తగ్గి, ఆయకట్టుకు సమర్థవంతంగా నీరందుతుందని తెలంగాణ నీటిపారుదల శాఖ అధికారులు వివరించారు. పాత ఒప్పందాన్ని సవరించాల్సిన ఆవశ్యకతను తెలుపుతూ.. నిపుణులు ఇచ్చిన టెక్నికల్ రిపోర్టును పవర్‌పాయింట్ స్లైడ్స్ ద్వారా సమావేశంలో సీడబ్ల్యూసీకి నిశితంగా వివరించారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ సమర్పించిన తుమ్మిడిహట్టి కంప్లీట్ రిపోర్టుపై మహారాష్ట్ర ప్రభుత్వం, సీడబ్ల్యూసీ అధ్యయనం చేయనున్నాయి. బ్యారేజీ ఎత్తు సవరణ, ముంపు అంచనాలపై స్పష్టత సాధించేందుకు 2 వారాల వ్యవధి తర్వాత మరోసారి సీడబ్ల్యూసీ ఆధ్వర్యంలో ఉన్నతాధికారుల సమావేశం జరగనుంది. కాగా, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగునీరు అందించే తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును పునరుద్ధరించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. మహారాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులతో పాటు కేంద్ర జలశక్తి శాఖ దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లడంతో సీడబ్ల్యూసీ తాజాగా చర్చలకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే.

# ఉగ్రవాదం ఎప్పటికీ వ్యూహాత్మక ఆస్తి కాదు

## - పాక్ ప్రధాని ముందే ఉగ్రవాదంపై మోడీ స్ట్రాంగ్ మెసేజ్

## -షాంఘై సహకార సంస్థ సదస్సులో మోడీ ప్రసంగం

బిష్కెక్:కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరుగుతున్న షాంఘై సహకార సంస్థ సదస్సులో ప్రధాని మోడీ ఉగ్రవాదంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదాన్ని ప్రభుత్వ విధానంగా ఉపయోగించే దేశాలు, ఉగ్రవాదులకు ఆశ్రయం, మద్దతు ఇచ్చే దేశాలకు అంతర్జాతీయ సమాజం గట్టి సందేశం ఇవ్వాలని పిలుపునిచ్చారు. "ఉగ్రవాదం ఎప్పటికీ వ్యూహాత్మక ఆస్తి కాదు" అని మోడీ స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సమక్షంలోనే చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఎస్‌సీవో దేశాధినేతలను ఉద్దేశించి మోడీ మాట్లాడుతూ.. ఉగ్రవాదాన్ని తమ విధానాలను అమలు చేసేందుకు సాధనంగా ఉపయోగించే దేశాలను ఉపేక్షించకూడదన్నారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించడం, వారికి మద్దతు ఇవ్వడం వంటి చర్యలకు పాల్పడే దేశాలకు అంతర్జాతీయ సమాజం నుంచి గట్టి హెచ్చరిక వెళ్లాలని అన్నారు. "ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాలకు చోటు లేదనే విషయాన్ని మనమంతా ఒకే గొంతుతో చెప్పాలి. ఉగ్రవాదాన్ని ప్రభుత్వ విధానంగా ఉపయోగించే దేశాలు, ఉగ్రవాదులకు ఆశ్రయం, మద్దతు ఇచ్చే దేశాలకు ఉగ్రవాదం వ్యూహాత్మక ఆస్తి కాదనే బలమైన సందేశం ఇవ్వాలి" అని మోడీ పేర్కొన్నారు. ఉగ్రవాదానికి సంబంధించిన మొత్తం వ్యవస్థను సమూలంగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని ప్రధాని మోడీ



అన్నారు. ఉగ్రవాదానికి నిధులు సమకూర్చడం, ఉగ్రవాదుల నియామకం, తీవ్రవాద భావజాలం వైపు మళ్లించడం, వారికి సురక్షిత స్థావరాలు కల్పించడం వంటి అన్ని అంశాలపై దేశాలు కలిసి పనిచేయాలని సూచించారు. 2025లో జరిగిన ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో మోడీ తాజా వ్యాఖ్యలకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం భారత్.. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని సైనిక చర్య చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉగ్రవాదంపై భారత్ వైఖరిని మోడీ మరోసారి స్పష్టం చేశారు.

# కేంద్రం తన హామీని నిలబెట్టుకుంది..

## విద్యార్థులపై ఎలాంటి చర్యలు ఉండవు: జేపీ నడ్డా..

న్యూఢిల్లీ: ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నీట్ పేపర్ లీక్ ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన కేసులను ఎత్తివేసే ప్రక్రియను వేగవంతం చేసినట్లు కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకునే ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. ఈ ఏడాది జులై నెలలో ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోబోమని ఇచ్చిన హామీని కేంద్ర ప్రభుత్వం నిలబెట్టుకుందని నడ్డా పేర్కొన్నారు. కేంద్రంతో పాటు బీజేపీ పాలితరాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదింపులు జరిపి, విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను రద్దు చేసే ప్రక్రియను వేగవంతం చేసినట్లు నడ్డా తెలిపారు. విద్యార్థులు, యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వంసానుకూల చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. దేశ యువత, విద్యార్థుల అభ్యున్నతి, వికాసమే ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని నడ్డా చెప్పుకొచ్చారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సెప్టెంబర్ 5న నిర్వహించాల్సిన ర్యాలీని విరమించుకు ంటున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ ప్రకటించడాన్నీ కేంద్ర మంత్రి జేపీ నడ్డా స్వాగతించారు. కాగా, నీట్ పేపర్ లీక్‌తో దేశ రాజధాని సహా పలు రాష్ట్రాల్లో సీజేపీ కార్యకర్తలు పెద్దఎత్తున నిరసనలు చేపట్టారు. కొన్ని వారాలపాటు ఆందోళనలు



కొనసాగగా..జులై 20 నుంచి 25 మధ్య పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. దీంతో ఢిల్లీతో పాటు పలు రాష్ట్రాల్లో నిరసనకారులపై కేసులు నమోదయ్యాయి. అయితే, విద్యార్థులపై నమోదైన అన్ని కేసులను సుప్రీంకోర్టు నేడు రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. సీజేపీ నిరసనలకు సంబంధించిన కేసులను ఉపసంహరించుకుంటామని, కొత్త ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయబోమన్న కేంద్ర ప్రభుత్వ హామీ మేరకు సుప్రీంకోర్టు ఈ నిర్ణయం తీసుకుంది.

# మళ్లీ పెరిగిన గ్యాస్ సిలిండర్ ధర..



**న్యూఢిల్లీ,సెప్టెంబర్,01:** ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు గ్యాస్ సిలిండర్ల ధరలను మరోసారి పెంచాయి. తాజా వివరాల ప్రకారం.. 19 కిలోల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ల ధరలను సవరించాయి. పలు నగరాల్లో ధరలు పెరగడంతో హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, క్యాంటీన్లు, ఇతర వాణిజ్య సంస్థలకు అదనపు ఖర్చు తప్పడం లేదు. ఇది సాధారణ వినియోగదారులకు కొంత ఊరట కలిగించే అంశంగా చెప్పవచ్చు. ఇండియన్ ఆయిల్ విడుదల చేసిన తాజా ధరల ప్రకారం హైదరాబాద్‌లో 19 కిలోల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ. 11 పెరిగి రూ. 2,996కు చేరుకుంది. ఢిల్లీలో రూ. 9.50 పెరిగి రూ. 2,747.50కు చేరగా, ముంబైలో రూ. 2,691.50 నుంచి రూ. 2,701కు పెరిగింది. చెన్నైలో కూడా ధర రూ. 2,906 నుంచి రూ. 2,916.50కు పెరిగింది. అయితే గృహ అవసరాలకు ఉపయోగించే 14.2 కిలోల డొమెస్టిక్ ఎల్‌పీజీ సిలిండర్ ధరల్లో మాత్రం ఎలాంటి మార్పు చేయలేదు.

# భారత్ మిస్సైల్ పవర్‌కు మరో బూస్ట్..

## 2,995 కి.మీ. రేంజ్‌లో కీలక పరీక్షకు సన్నాహాలు

**న్యూఢిల్లీ,సెప్టెంబర్,01:** భారత్ తన రక్షణ, వ్యూహాత్మక సామర్థ్యాలను మరింత బలోపేతం చేసుకునే దిశగా మరో కీలక అడుగు వేస్తోంది. రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ , స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ ఆధ్వర్యంలో ఒడిశా తీరంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం నుంచి మరో కీలక క్షిపణి పరీక్షకు సన్నాహాలు జరుగుతోంది. ఇందుకోసం బంగాళాఖాతం, హిందూ మహాసముద్ర ప్రాంతంలో సుమారు 2,995 కిలోమీటర్ల పరిధికి సంబంధించినను అధికారులు జారీ చేశారు. తాజా నివేదికల ప్రకారం.. సెప్టెంబర్ 2, 3 తేదీల్లో ఈ క్షిపణి పరీక్ష నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పరీక్ష సమయంలో విమానాలు, సముద్ర కార్యకలాపాలకు అంతరాయం కలగకుండా నిర్దిష్ట ప్రాంతాన్ని నో-ఫ్లై జోన్‌గా ప్రకటించడంతో పాటు సముద్రంలో డేంజర్ కారిడార్‌ను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రాంతం దాదాపు 2,995 కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉండటం ఇప్పుడు ప్రపంచ రక్షణ రంగంలో ఆసక్తిని పెంచుతోంది. అయితే ఈ పరీక్షలో ఏ క్షిపణిని ప్రయోగించనున్నారనే విషయాన్ని రక్షణ మంత్రిత్వ శాఖ, అధికారికంగా వెల్లడించలేదు. అయితే రక్షణ రంగ



వర్గాల సమాచారం ప్రకారం.. ఈ పరిధి అగ్ని సిరీస్‌కు చెందిన ఇంటర్మీడియట్ రేంజ్ బాలిస్టిక్ మిస్సైళ్లలో ఒకటైన అగ్ని-3 లేదా అగ్ని-4 పరీక్షకు సంబంధించినదై ఉండొచ్చని అంటున్నారు.

# ఏపీలో సర్ గడువు పొడిగింపు..

## అక్టోబర్ 9న తుది జాబితా

అమరావతి,సెప్టెంబర్ 1: ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు కేంద్ర ఎన్నికల సంఘం గడువు పొడిగించింది. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి చేసిన అభ్యర్థన మేరకు ఎస్ఐఆర్ షెడ్యూల్‌లో కీలక మార్పులు చేసింది. సవరించిన షెడ్యూల్ ప్రకారం ఓటర్ల జాబితాపై క్లెయిమ్‌లు, అభ్యంతరాల దాఖలుకు సెప్టెంబర్ 10వ తేదీ వరకు అవకాశం కల్పించింది. ఓటర్ల జాబితాలో పేర్లు, వివరాలకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉన్నా, అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో లేకపోయినా ఈ గడువులోగా క్లెయిమ్‌లు, అభ్యంతరాలు దాఖలు చేయవచ్చని అధికారులు తెలిపారు. అందిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరించేందుకు అక్టోబర్ 5వ తేదీ వరకు గడువు ఇచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిన అనంతరం అక్టోబర్ 9వ తేదీన తుది ఓటర్ల జాబితాను విడుదల చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది.
దీంతో రాష్ట్రంలోని ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించి



ఈ తేదీలు మారాయి. సవరించిన ఎస్ఐఆర్ షెడ్యూల్‌ను వెంటనే రాష్ట్ర గెజిట్‌లో ప్రచురించాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. అలాగే షెడ్యూల్‌లో చేసినమార్పులపై రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి సూచించింది. ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఓటర్ల జాబితాలో తమ పేరు ఉందో లేదో పరిశీలించుకోవాలని అధికారులు సూచించారు.

## తుమ్మిడిహట్టిపై తెలంగాణ, మహారాష్ట్ర

# ఉన్నతాధికారుల సుదీర్ఘ భేటీ..


న్యూఢిల్లీ: తుమ్మిడిహట్టి బ్యారేజీపై ఢిల్లీలో కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలో తెలంగాణ, మహారాష్ట్ర ఉన్నతాధికారుల మధ్య సమావేశం ముగిసింది. సీడబ్ల్యూసీ ఛైర్మన్ అనుపమ్ ప్రసాద్ అధ్యక్షతన సుదీర్ఘంగా చర్చలు జరిగాయి. ఈ సమావేశంలో ప్రాణహిత నదిపై తెలంగాణ ప్రతిపాదించిన తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా బ్యారేజీ ఎత్తు, సాంకేతిక అంశాలు, అంతర్రాష్ట్ర సమస్యలపై ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారులు సమీక్షించారు. తుమ్మిడిహట్టి బ్యారేజీ ఎత్తును గతంలో మహారాష్ట్ర అంగీకరించిన 148 మీటర్లకు బదులుగా 152 మీటర్లకు పెంచేలా ఆ రాష్ట్రాన్ని ఒప్పించేందుకు తెలంగాణ అధికారులు తమ ప్రతిపాదనలను సమావేశంలో వివరించినట్లు తెలిసింది. బ్యారేజీ ఎత్తు పెంపుతో తెలంగాణకు కలిగే ప్రయోజనాలను అధికారులు మహారాష్ట్ర దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. అయితే, 152 మీటర్ల ఎత్తుపై మహారాష్ట్ర నుంచి స్పష్టమైన నిర్ణయం వెలువడలేదని తెలుస్తోంది. 152 మీటర్ల ప్రతిపాదనకు అంగీకారం కుదరని పరిస్థితుల్లో కనీసం 150 మీటర్ల ఎత్తుకైనా అంగీకరించాలని తెలంగాణ అధికారులు కోరినట్లు తెలిసింది. తెలంగాణ ప్రతిపాదనలను ఆ రాష్ట్ర అధికారులు



స్వీకరించి, వాటిని పరిశీలించిన అనంతరం నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. బ్యారేజీ ఎత్తుపై ఇరు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం సాధించేందుకు తదుపరి దశలో మరోసారి సమావేశం కావాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. కాగా, తుమ్మిడిహట్టి బ్యారేజీ ఎత్తుపై తెలంగాణ, మహారాష్ట్ర మధ్య నెలకొన్న అంశాలకు పరిష్కారం చూపే దిశగా సీడబ్ల్యూసీ ఛైర్మన్ అధ్యక్షతన జరిగిన తాజా సమావేశం కీలకంగా మారింది. తదుపరి భేటీలో బ్యారేజీ ఎత్తుపై మరింత స్పష్టత వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# 'నీట్ కేసులు రద్దు చేయండి'.. సుప్రీంకోర్టును కోరిన 4 రాష్ట్రాలు

**న్యూఢిల్లీ,సెప్టెంబర్,01:**
నీట్ పేపర్ లీక్ అంశంపై విద్యార్థుల ఆందోళనలకు సంబంధించి నమోదైన కేసుల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. విద్యార్థులపై నమోదైన 116 ఎఫ్ఐఆర్‌లను రద్దు చేయాలని కోరుతూ బిహార్,పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, అస్సాం రాష్ట్రాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 ప్రకారం తమ రాష్ట్రాల్లో నమోదైన కేసులను వెంటనే ఎత్తివేయాలని కోరుతూ 4రాష్ట్రాలు వేర్వేరు పిటిషన్లలో విజ్ఞప్తి చేసినట్లు తెలుస్తోంది. విద్యార్థులు ఆందోళనలు విరమిస్తే వారిపై నమోదైన కేసులను ఉపసంహరించుకుంటామని జులై 25న కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ)కి ఇచ్చిన హామీని ఆయా రాష్ట్రాలు తమ పిటిషన్లలో ప్రస్తావించినట్లు తెలుస్తోంది. విద్యార్థులపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవాలనే డిమాండ్‌తో ఈ నెల 5న



ఢిల్లీలో ర్యాలీ నిర్వహించేందుకు సీజేపీ పిలుపునిచ్చిన నేపథ్యంలో కేంద్రం, రాష్ట్రాలు వేగంగా స్పందించినట్లు తెలుస్తోంది.

# సంపాదకీయం

## విద్యుత్ సంస్థలపై ప్రయివేటు పడగ..?

ప్రభుత్వరంగ విద్యుత్ సంస్థలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రయివేటీకరణ విధానాల నీడ మరింత ముసురుతోంది. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లోని కీలక విభాగాలను ప్రయివేటు సంస్థలకు అప్పగించే చర్యలు, 'రైతు డిస్కం' ఏర్పాటు ప్రయత్నాలు, మరోవైపు కేంద్రం తీసుకొచ్చిన 2025 విద్యుత్ సవరణ బిల్లు కలిసి తెలంగాణ విద్యుత్ రంగ భవిష్యత్తుపై ఆందోళనలు పెంచుతున్నాయి. ప్రధాని మోడీ పార్లమెంటులో ప్రవేశపెట్టిన విద్యుత్ సవరణ బిల్లు ఆమోదం పొందితే విద్యుత్ రంగం పూర్తిగా ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లే ప్రమాదముంది. ఇప్పటికే తెలంగాణ విద్యుత్ సంస్థలను ప్రయివేటీకరిం చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చాలా వేగంగా ప్రయత్నాలు ప్రారంభించింది. ఇది గమనించిన తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్లు జేఏసీగా ఏర్పడి రాష్ట్రవ్యాప్తంగా గత పది రోజులుగా నిరసన తెలుపుతున్నారు. విద్యుత్ రంగ సంస్థలు ప్రయివేటీకరణ కాకుండా అడ్డు కుంటేనే స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు వచ్చే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయి. రాష్ట్రంలో యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లోని స్టేజ్ 1, 2 యూనిట్లకు సంబంధించి కూల్ హ్యాండ్లింగ్ ప్లాంట్, యాష్ హ్యాండ్లింగ్ ప్లాంట్, ఆపరేషన్ మెయింటెనెన్స్, మెకానికల్ ఎలక్ట్రికల్ పనులను ప్రయివేటు సంస్థకు అప్పగించేందుకు జెన్కో టెండర్లు పిలిచింది. ఈ జనవరి నుంచి ఇప్పటివరకు పరిణామాలను చూస్తే.. 'రైతు పవర్ విస్కం' పేరుతో ఒక కొత్త డిస్కం ఏర్పాటు చేయడానికి కావాల్సినవి సిద్ధం చేసుకుని, వీటి లైసెన్స్ కోసం ఈఆర్‌సీలో బహిరంగంగా విచారణ కూడా పూర్తిచేసింది. ఇక లైసెన్స్ ఇవ్వడం ఆలస్యంగా మారిం దంటూ రైతు డిస్కం, ఇటు వైటీపీఎస్‌లో కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా 2003 విద్యుత్ చట్టంలో భాగంగా మన విద్యుత్ సంస్థలు ప్రయివేటీకరణ అనివార్యం అయిపోయింది. ఈ ప్లాంట్ నిర్మించి ఏడాది కాకముందే ప్రయివేటీకరణ ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. 2025 ఆగస్టులో ఉత్పత్తి ప్రారంభించిన ఈ సంస్థ మన డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క గత ఆగస్టు నెలలో జాతికి అంకితం చేశారు. 2,800 ఎకరాల్లో నిర్మించిన పవర్ ప్లాంట్ దేశంలోనే అతి పెద్ద పవర్ ప్లాంట్‌లో రెండవది. అత్యధికంగా గిరిజనులు నివసిస్తున్న ప్రాంతాలను ప్రభుత్వం ఆక్రమించి అటవీ భూములతో పాటు రైతులు తమ భూములు, ఇండ్లను కూడా కోల్పోయి భూములిచ్చారు. దాంతో సుమారు రూ.30 నుంచి 35 వేల కోట్లతో నిర్మించిన ఈ ప్లాంట్ ఏడాది తిరగకముందే స్టేజీ 1, 2 లను ప్రయివేటు కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధపడుతుంది. ఈ ప్లాంట్ నిర్మాణం కోసం భూములిచ్చిన రైతు కుటుంబ సభ్యులకు, ఇండ్లు కోల్పోయిన పేదలకు పూర్తిస్థాయిలో ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు. జెన్కో నిర్మాణం కోసం భూములిస్తే సర్కారు నౌకరి వస్తుందని ఆశతో ఖరీదైన భూములను త్యాగం చేశారు. ప్రస్తుతానికి ప్రయివేట్‌కి ఇవ్వడానికి రంగం సిద్ధం చేసింది. దీనిని ఐక్యంగా ఎదుర్కోలేకపోతే మిగిలిన 3, 4, 5 స్టేజీలు కూడా టెండర్లు పిలిచే అవకాశం ఉంది. అలాగే 2014 సంవత్సరంలో ఎన్డీఏ నాయకత్వంలో మోడీ.. ప్రధానమంత్రి అయినప్పటి నుంచి స్వదేశీ పెట్టుబడిదారుల కన్ను విద్యుత్ సంస్థలపై పడింది. వాజ్‌పేయి ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు తయారైన 2003 విద్యుత్ చట్టంలోని ప్రయివేట్ పెట్టుబడుదాలకు కావాల్సినన్ని ప్రయోజనాలు కల్పించారు. అయినప్పటికీ పెట్టుబడిదారులకు సంతృప్తి కలుగలేదు. అనేక సవరణలతో విద్యుత్ సంస్థలను వాడుకొని అధిక లాభాలు సంపాదించాలనే కోరిక పెట్టుబడిదారులకు ఉన్నట్టు తెలుస్తుంది. ఉదాహరణకు బీఎస్ఎన్ఎల్ టవర్లపై రిలయన్స్ నెట్‌వర్క్ మాదిరిగా మన నెట్‌వర్క్‌ను వాడుకొని కేవలం బిల్లింగ్ చార్జీలు మాత్రమే విద్యుత్ సంస్థ లకు చెల్లిస్తారు. ఉదయ్ ఆదిత్య, ఆర్డీఎస్ఎస్ అనే పేర్లతో కొత్త కొత్త ప్రతిపాదనలు ముందుకు తెస్తూ రాష్ట్ర డిస్కమ్‌లకు ఆర్థిక సాయం చేస్తామని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలను ప్రలోభాలకు గురిచేస్తుంది. కేంద్ర ప్రభుత్వం చేసే ప్రయత్నాలను వ్యతిరేకించకుండా మన రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రం ఆదేశాలను ఆచరణలో పెడుతోంది. దీనిలో భాగమే మన తెలంగాణ రైతు డిస్కం, వైటీపీఎస్ స్టేజీ 1, 2లో జరిగే ప్రయివేటీకరణ ప్రయత్నాలు. కేంద్ర ప్రభుత్వం చేసే ప్రయోగాలతో రాబోయే ఐదేండ్లల్లో సబ్సిడీలు, క్రాస్ సబ్సిడీలు పూర్తిగా రద్దు చేయాలని కూడా 2025 విద్యుత్ సవరణ బిల్లులో స్పష్టంగా ఉన్నాయి. 2003 విద్యుత్ చట్టంలో ప్రయివేటు కంపెనీలు డిస్ట్రిబ్యూషన్ చేయాలనుకుంటే నెట్‌వర్క్ వారు ఏర్పాటు చేసుకోవాలని ఉంది. కానీ, 2025 విద్యుత్ సవరణ బిల్లులో విద్యుత్ సంస్థలకు ఉన్న నెట్‌వర్క్‌నే షేర్ చేసుకో వచ్చని సవరణలో పెట్టారు. అంటే కంటెంట్ చర్యలు సిస్టం అమల్లోకి రాబోతుందని స్పష్టమవుతుంది. 2003 విద్యుత్ చట్టంలో జనరేటింగ్ స్టేషన్ పెట్టుకోవడానికి లైసెన్స్ తీసుకోవాల్సిన పనిలేదు. కాబట్టి ప్రయివేటు ఉత్పత్తిచేసిన కరెంట్‌ను మన నెట్‌వర్క్‌లోకి వస్తే గ్రిడ్డు ప్రమాదంలో పడుతుంది. కాబట్టి ప్రయివేటు ఉత్పత్తి చేసే విద్యుత్‌ను మన లైసెన్స్ మీదకు రావడం వల్ల మన జనరేటింగ్ స్టేషన్‌లో ఉత్ప[illegible]

పబ్లిషర్: కొక్కు రవికుమార్

# కొత్తపుంతలు తొక్కుతున్న ప్రపంచ ఫ్యాషన్ టెక్నాలజీ



ప్రతి ఒక్కరు తమ ఫ్యాషన్ భావాలను వ్యక్తీకరించడానికి ఒక ప్రత్యేక మార్గాన్ని ఎంచుకుంటారు. ఒక్కొక్కరి వస్త్రధారణ ఒక్కో విధంగా ఉంటుంది. కులాలు, మతాలు, జాతులు, దేశాలు, ప్రాంతాలను బట్టి ఫ్యాషన్స్ మారుతుంటాయి. ఒక్కో జాతికి ఒక రకమైన విలక్షణ వస్త్రధారణ పద్ధతులు ఉంటాయి. ఫ్యాషన్ ప్రపంచం, పరిశ్రమ చాలా పెద్దది. ఫ్యాషన్ టెక్నాలజీ క్షణక్షణం మారుతోంది. తరాలు మారిన కొద్దీ ఫ్యాషన్లు కూడా మారుతున్నాయి, కొన్ని సందర్భాల్లో వెర్రి పోకడలు కూడా సంతరించుకుంటున్నాయి. ప్రపంచ మానవాళి దృష్టిని తమ ఫ్యాషన్ల వైపుకు మరల్చడానికి, ప్రత్యేక సౌందర్య భావాలను వ్యక్తం చేయడానికి, వారి వారి విభిన్న దుస్తులు లేదా ఉపకరణాలను ప్రదర్శించడానికి ఒక వేదికగా ప్రతి ఏట 09 జూలై రోజున "అంతర్జాతీయ ఫ్యాషన్ దినోత్సవం (ఇంటర్నేషనల్ ఫ్యాషన్ డే)" పాటించుట 2016 నుంచి ఆనవాయితీగా మారింది. ఫ్యాషన్ రంగం చాలా పెద్దది. నేడు ప్రపంచ ఫ్యాషన్ పరిశ్రమ/మార్కెట్ దాదాపు 1.84 ట్రిలియన్ డాలర్ల వ్యాపారంగా మారింది. ప్రపంచ మానవ జనాభా 8 బిలియన్లకు సాలీనా దాదాపు 100 బిలియన్ల వరకు దుస్తులు ఉత్పత్తి అవుతున్నాయి. ప్రతి ఒక్కరికి సగటున ఒక ఏడాదికి 12 – 14 దుస్తులు కొనుగోలు చేస్తున్నారు. వస్త్ర ఉత్పత్తిలో అతి పెద్ద దేశంగా చైనా తొలి స్థానాన్ని ఆక్రమించింది. ఫ్యాషన్ పరిశ్రమ ద్వారా సృజన, ఆవిష్కరణ, సంస్కృతి, వేషధారణ, పలు రకాలు దుస్తులు, కేశాలంకరణ, అలంకరణ, ఆభరణాలు లాంటి పలు అంశాలు ఉంటాయి. ఫ్యాషన్ ప్రపంచంలో వ్యక్తులు, డిజైనర్లు, క్రియేటర్స్, మోడల్స్, స్టైలిస్ట్స్, ఇన్నొవేటర్స్, ట్రెండ్స్, ఇన్ఫుయెన్సర్స్ ద్వారా పలు రకాల ఫ్యాషన్స్ పుట్టుకొస్తున్నాయి, మార్కెట్‌ను ముంచేస్తున్నాయి. నిన్నటి ఫ్యాషన్ నేడు పాతబడిపోయి, నేటి ఫ్యాషన్స్ కోకొల్లలుగా పుట్టుకొస్తున్నాయి. ఫ్యాషన్ అంటే దుస్తులు మాత్రమే కాదని, ఇది ఒక హద్దులు లేని వింత ప్రపంచమని అర్థం అవుతున్నది. ఫ్యాషన్ రంగం అంటేనే సృజనశీలత, ఆవిష్కరణ, సంస్కృతికి వైవిధ్యం, ప్రత్యేక గుర్తింపు లాంటి అంశాలకు పుట్టిల్లు. సామాజిక మార్పులు, కళలకు అపూర్వ వేదికగా అంతర్జాతీయ ఫ్యాషన్ దినం ఉపయోగపడుతున్నది. ఫ్యాషన్ డిజైన్ అంటే దుస్తులు, కొన్ని వస్తువులను అందంగా, వినూత్నంగా తీర్చి దిద్దే కళ అని తెలుసుకోవాలి. దీనిలో అవలంభించే పద్ధతుల సమాహారాన్ని ఫ్యాషన్ టెక్నాలజీ అని పిలుస్తాం. మానవ అభిరుచులను బట్టి దుస్తులు, అలంకార వస్తువులను తయారు చేసే నిపుణులను ఫ్యాషన్ డిజైనర్స్ అంటాం. దుస్తులు, ఉపకరణాల రూపకల్పన, ఉత్పత్తిలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించడాన్ని ఫ్యాషన్ టెక్నాలజీగా పిలుస్తున్నాం. ఫ్యాషన్ టెక్నాలజీలో ఫ్యాషన్ డిజైన్స్, వస్త్ర సాంకేతికత, ఫ్యాషన్ ఉత్పత్తులు, ఫ్యాషన్ మార్కెట్, రిటైల్ లాంటి పలు రంగాలు ఉంటాయి. నేటి డిజిటల్ యుగంలో కంప్యూటర్–సహాయ ఉత్పత్తి/డిజైన్స్, 3డి ప్రింటింగ్, ఆగ్మెంటెడ్ రియాలిటీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ లాంటి పరిజ్ఞానాలు వాడబడుతున్నాయి. ఇవి ఫ్యాషన్ ప్రపంచ పరిశ్రమను మరింత సమర్థవంతంగా, సుస్థిరంగా, వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా, ఆకర్షణీయంగా మార్చడంలో సహాయపడుతున్నది. ఆధునిక పౌర సమాజ అభిరుచులకు అద్దం పడుతున్నది నేటి ఫ్యాషన్ పరిశ్రమ. మారుతున్న కాలంతో పాటు ఫ్యాషన్లు కూడా అత్యంత వేగంగా మారుతున్నాయి. ప్రతి ఏటా 09 జూలై రోజు నిర్వహించే అంతర్జాతీయ ఫ్యాషన్ దినం వేదికగా ప్రదర్శనలు, పోటీలు, సామాజిక మాధ్యమ అవగాహనలు, నూతన బ్రాండ్ల ప్రదర్శనలు, డిస్కౌంట్స్, స్థానిక బ్రాండ్ల ప్రోత్సాహం, కొత్త బ్రాండ్ల ప్రారంభం, ఫ్యాషన్ టెక్నాలజీ సృజనకారుల గుర్తింపు లాంటి కార్యక్రమాలను నిర్వహించవచ్చు. మానవ జాతి పుట్టుక నుంచి నేటి వరకు ఫ్యాషన్ రంగం కొత్తపుంతలు తొక్కుతూనే ఉన్నది. ఇదో వింత, విచిత్ర ప్రపంచం. పౌర సమాజంతో విడదీయరాని సంబంధం కలిగిన ఫ్యాషన్ ప్రపంచం నిన్నటి, నేటి, రేపటి తరాలకు తగిన విధంగా తమ ఉత్పత్తులను విడుదల చేస్తూనే ఉన్నాయి. అంతర్జాతీయ ఫ్యాషన్ దినోత్సవం–2026 ఇతివృత్తంగా "ఫ్యాషన్ ద్వారా ఐక్యత (యునిటీ త్రూ ఫ్యాషన్)" అనే అంశాన్ని తీసుకొని, ఈ వేదికగా మన సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా ప్రదర్శనలు నిర్వహిస్తూ మన దేశ ఐక్యత సాధనకు కృషి జరుగుతోంది. ఫ్యాషన్ టెక్నాలజీ పెరగడం శుభ సూచకమే అయినప్పటికీ ఫ్యాషన్లు వెర్రితలలు వేయకూడదు, మన సాంస్కృతిక మూలాలను మరిచి పోకూడదు. మన ప్రాంత వాతావరణాన్ని, అవసరాలను, సందర్భాలను బట్టి మన వేషధారణ ఉండాలి. ఫ్యాషన్ పేరుతో అసహ్యకర రూపును పొందరాదని గమనించాలి.

# దక్షిణ కోస్తా అభివృద్ధికి కొత్త అక్షమా

**గుంటూరు,** : దక్షిణ కోస్తా అభివృద్ధి గురించి మాట్లాడేటప్పుడు నీటి వనరులు, వ్యవసాయం, పోర్టులు, పారిశ్రామిక అవకాశాల గురించి ఎంత చెప్పినా, గత దశాబ్దంలో ఈ ప్రాంత భవిష్యత్తుపై అత్యధిక చర్చకు దారితీసిన అంశం మాత్రం అమరావతి . అయితే అమరావతి గురించి జరిగిన చర్చల్లో చాలా వరకు రాజకీయ వాదోపవాదాలే ప్రధానంగా నిలిచాయి. అభివృద్ధి కోణంలో దాని పాత్ర ఏమిటి? ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం ఎంత? అనే ప్రశ్నలు మాత్రం చర్చకు రాకుండా ఇప్పటికీ ప్రశ్నలుగానే మిగిలిపోయాయి. రాజధాని అంటే కేవలం శాసనసభ, సచివాలయం, ప్రభుత్వ కార్యాలయాల సముదాయం కాదు. పరిపాలన, విధాన రూపకల్పన, పెట్టుబడులు, విద్య, వైద్యం, సేవారంగం, సాంకేతిక రంగాలు పరస్పరం అనుసంధానమయ్యే కేంద్రం. ప్రపంచంలోని అనేక ప్రణాళికాబద్ధ నగరాల అనుభవం కూడా ఇదే విషయాన్ని చెబుతోంది. ఒక సమర్థవంతమైన రాజధాని తన సరిహద్దులకే అభివృద్ధిని పరిమితం చేయకుండా, చుట్టుపక్కల ప్రాంతాల ఆర్థిక కార్యకలాపాలకు కూడా కొత్త ఊపును అందించగలగాలి. ఆ కోణంలో చూస్తే, అమరావతి విజయాన్ని నిర్మించిన భవనాల సంఖ్యతో కొలవడం సరైన ప్రమాణం కాదు. ప్రభుత్వ సంస్థలు ఎంత స్థిరంగా పనిచేస్తున్నాయి? ప్రైవేట్ పెట్టుబడులను ఎంతవరకు ఆకర్షించగలిగింది? సేవారంగం ఎంత విస్తరించింది? విద్యా, వైద్య సంస్థలు ఎంత వేగంగా అభివృద్ధి చెందాయి? నైపుణ్యాధారిత ఉద్యోగాలకు ఎంత మేర అవకాశాలు సృష్టించబడ్డాయి?... ఈ ప్రశ్నలే అమరావతి అభివృద్ధి విలువను నిర్ణయిస్తాయి. ఒక రాజధాని నగరం నిర్మాణం అంటే ప్రభుత్వ కార్యాలయాలను ఒక చోటుకి తరలించడం మాత్రమే కాదు. ఒకచోట కేంద్రీకృతం చేయడమే కాదు. పరిపాలనా వ్యవస్థ స్థిరపడిన చోట నిర్ణయాల వేగం పెరుగుతుంది. ప్రభుత్వ శాఖలు, నియంత్రణ సంస్థలు, న్యాయవ్యవస్థ, ప్రజా సేవలకు సంబంధించిన అనేక సంస్థలు ఒకదానితో మరొకటి సమన్వయంతో పనిచేసే అవకాశం ఏర్పడుతుంది. దాని ప్రభావం క్రమంగా ప్రభుత్వ వ్యవస్థను దాటి ప్రైవేట్ పెట్టుబడులు, సేవారంగం, ఉపాధి అవకాశాల వరకు విస్తరిస్తుంది. అందుకే ఒక రాజధాని నగర విజయాన్ని నిర్మించిన భవనాల సంఖ్యతో కాదు; అక్కడ ఏర్పడిన సంస్థల బలంతో కొలవాలి. దక్షిణ కోస్తా అభివృద్ధి కథలో అమరావతి ఒక ప్రత్యేక అధ్యాయం. దీనిని కేవలం ప్రభుత్వ కార్యాలయాల సమాహారంగా చూస్తే దాని పూర్తి విలువ అర్థం కాదు. ఒక రాజధాని నగరం పరిపాలనకు కేంద్రంగా మారవచ్చు. కానీ విద్య, వైద్యం, పరిశోధన, సాంకేతికత, సేవారంగం కలిసినప్పుడే అది ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థను కొత్త దిశగా నడిపిస్తుంది. సుమారు 217 చదరపు కిలోమీటర్ల (దాదాపు 53,700 ఎకరాల) రాజధాని నగర ప్రాంతం దీర్ఘకాలిక దృష్టితో రూపొందించబడింది. పరిపాలనతో పాటు నివాసం, విద్య, ఆరోగ్యం, వ్యాపారం, పరిశోధన, సేవారంగం పరస్పరం అనుసంధానమయ్యే నగర నమూనాను ఇది లక్ష్యంగా పెట్టుకుంది. భవిష్యత్ దృష్టిలో క్వాంటమ్ వ్యాలీ ప్రతిపాదన అమరావతిని క్వాంటమ్



కంప్యూటింగ్, కృత్రిమ మేధస్సు, డీప్ టెక్నాలజీ, ఆధునిక పరిశోధనల కేంద్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యాన్ని ప్రతిబింబిస్తోంది. ఇక అనుసంధానం కూడా అంతే కీలకం. సుమారు 189 కిలోమీటర్ల ప్రతిపాదిత అమరావతి ఔటర్ రింగ్ రోడ్ విజయవాడ?గుంటూరు?తెనాలి పట్టణ సముదాయాన్ని విస్తృత ప్రాంతీయ ఆర్థిక వలయంగా అనుసంధానించే సామర్థ్యాన్ని కలిగి ఉంది. అదే విధంగా ప్రతిపాదిత విజయవాడ?అమరావతి మెట్రో కారిడార్ (సుమారు 35?38 కి.మీ.) విద్య, ఉపాధి, సేవారంగాన్ని మరింత దగ్గర చేసే పట్టణ రవాణా వ్యవస్థగా రూపుదిద్దుకుంటోంది. అయితే అమరావతి విజయాన్ని భవనాల సంఖ్య నిర్ణయించదు. విద్యార్థులను ఆకర్షించే విశ్వవిద్యాలయాలు, ప్రపంచస్థాయి వైద్య సేవలు, పరిశోధన సంస్థలు, స్టార్టప్ ఎకోసిస్టమ్, నాలెడ్జ్ ఎకానమీ, వాటిని కలిపే రవాణా వ్యవస్థ?ఇవన్నీ కలిసినప్పుడే అది ప్రాంతీయ అభివృద్ధి కేంద్రంగా నిలుస్తుంది. ఏ ప్రాంతమైనా శాశ్వత అభివృద్ధిని సాధించాలంటే భౌతిక మౌలిక సదుపాయాలు మాత్రమే సరిపోవు. విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, వైద్య కళాశాలలు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు సమాంతరంగా ఎదగాలి. అలాంటి వ్యవస్థ ఏర్పడినప్పుడే స్థానిక యువతకు నాణ్యమైన విద్య, వైద్య సేవలు అందడంతోపాటు, దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి కూడా ప్రతిభ, పెట్టుబడులు ఆకర్షితమవుతాయి. ఈ కోణంలో చూస్తే, అమరావతి చుట్టూ విద్యా, వైద్య సంస్థల అభివృద్ధి కేవలం రాజధాని అవసరమే కాదు. దక్షిణ కోస్తా మానవ వనరుల నాణ్యతను పెంచే దీర్ఘకాలిక పెట్టుబడిగా కూడా చూడాలి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పోటీ క్రమంగా భూమి, భవనాలు, పరిశ్రమల నుంచి జ్ఞానం, పరిశోధన, సాంకేతికత వైపు మారుతోంది. ఈ నేపథ్యంలో అమరావతిని కేవలం పరిపాలనా కేంద్రంగా కాకుండా నాలెడ్జ్ ఎకానమీకి వేదికగా తీర్చిదిద్దాలనే ఆలోచన ప్రాధాన్యం సంతరించుకుంది. క్వాంటమ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధస్సు, డేటా సైన్స్, సెమీకండక్టర్ పరిశోధన, డీప్–టెక్ స్టార్టప్‌లు, డిజిటల్ సేవలు వంటి రంగాల్లో దీర్ఘకాలిక సామర్థ్యాన్ని పెంచే ప్రయత్నాలు విజయవంతమైతే, అమరావతి దక్షిణ కోస్తా ఆర్థిక నిర్మాణానికి మరో కొత్త కోణాన్ని జోడించే అవకాశం ఉంది. అయితే ఈ ప్రయత్నాల విజయాన్ని ప్రకటనలతో కాదు; సంస్థల స్థాపన, పరిశోధన, పెట్టుబడులు, ఉపాధి సృష్టి వంటి స్పష్టమైన ఫలితాలతోనే కొలవాల్సి ఉంటుంది.

# కల్లెడ గ్రామ శివారులో చిరుత సంచారం



## - ఆందోళనలో గ్రామస్తులు

**ఆర్మూర్ సెప్టెంబర్ 01(ప్రజా గళం)**నిజామాబాద్ జిల్లా ఆలూరు మండలం కల్లెడ గ్రామ శివారులో గుత్ప లిఫ్ట్ కెనాల్ వద్ద చిరుత పులుల సంచారం గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. అటవీ శాఖ సిబ్బంది పులులను పట్టుకుని అడవిలో విడిచి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు ఆందోళన గురవుతున్నారు. చిరుత పులులు తమపై ఎక్కడ దాడి చేస్తాయన్న భయాందోళనకు గురవుతున్నారు. ఫారెస్ట్ అధికారులు బోన్లను ఏర్పాటు చేసి చిరుత పులులను బంధించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# పెట్టుబడిదారీ విధానంతో ప్రజాశ్రేయస్సా?

నాగరికతను నిలబెట్టేది మార్కెట్లు కావు, చట్టాలు కావు, భౌతిక సంపద అంతకంటే కాదు. ఒక మనిషి మరొక మనిషి బాధను తన బాధగా భావించే సామర్థ్యం మాత్రమే సమాజాన్ని కాపాడుతుంది. ఆ సామర్థ్యం ఉన్నంతకాలం మానవత్వం జీవిస్తుంది. అది క్షీణించిన రోజు ఎంత సంపన్నమైన పెట్టుబడిదారీ వ్యవస్థ అయినా లోపల నుంచి కూలిపోవడం ప్రారంభమవుతుందనీ అర్థశాస్త్ర పితామహుడు ఆడమ్ స్మిత్ తెలియజేసినారు. అంటే ఆడమ్ స్మిత్ మనకు చెప్పిన అత్యంత విలువైన పాఠం మార్కెట్ ఎకానమీ కాదు.. ప్రజా శ్రేయస్సు.. తన 'ఆన్ ఎంక్వయిరీ ఇన్ టూ నేచర్ అఫ్ వెల్త్ ఆఫ్ నేషన్స్' అనే గ్రంథాన్ని రాసేటప్పుడు (1776) పెట్టుబడి, మార్కెట్లు, లాభాల ద్వారా దేశాలు అభివృద్ధి చెందుతాయని నమ్ము కోవడం నిజమే కానీ ఆ తర్వాత రాసిన గ్రంథంలో 'ద థియరీ ఆఫ్ మోరల్ సెంటిమెంట్స్' ద్వారా సాటి మనిషి బాధను అర్థం చేసుకోకపోతే ఏ మార్కెట్ అయినా కుప్పకూలిపో తుందని ఆనాడే హెచ్చరించాడు. డబ్బు ప్రపంచాన్ని నడిపిస్తుందని మనం అనుకుంటాం. కానీ పెట్టుబడిదారీ వ్యవస్థకు మేధోపరమైన పునాది వేసిన ఆడమ్ స్మిత్ మాత్రం మానవ శ్రేయస్సును నమ్మాడు. సాటి మనిషి బాధను అర్థం చేసుకునే సామర్థ్యం లేకపోతే ఏ మార్కెట్ అయినా చివరికి కూలిపోతుందని ఆడమ్ స్మిత్ నమ్మాడు. పెట్టుబడిదారీ వ్యవస్థకు పునాది వేసిన వ్యక్తి మార్కెట్ విధానాన్ని చివరి రోజుల్లో వ్యతిరేకించారు. మానవ నాగరికత ప్రయాణాన్ని అసలు ముందుకు నడిపించింది ఏమిటి? సంపదా? పోటీనా? లేక ఒకరి బాధను మరొకరు అర్థం చేసుకునే మానసిక సామర్థ్యమా? ఈ ప్రశ్నకు సమాధానం వెతికే క్రమంలో మనం తరచుగా ఆర్థిక సూత్రాల వైపు చూస్తుంటాం. ఆడమ్ స్మిత్ పేరు వినగానే మనకు గుర్తొచ్చేది మార్కెట్, లాభాలు, పోటీ, స్వప్రయోజనం. ఈ పరుగు పందెంలో మనం ఆయనను ఒక క్రూరమైన పెట్టు బడిదారీ విధానానికి చిహ్నంగా మార్చేశాం. లాభాల వేటను మాత్రమే ఆయన బోధించారని తప్పుగా నమ్మాం. 1776లో ఆడమ్ స్మిత్ 'యాన్ ఎంక్వైరీ ఇన్‌టు ది నేచర్ అండ్ కాజెస్ ఆఫ్ ది వెల్త్ ఆఫ్ నేషన్స్' అనే గ్రంథాన్ని ప్రచురించారు. ఆధునిక అర్థశాస్త్రానికి అది పునాదిగా మారింది. వ్యక్తిగత ప్రయోజనం కోసం పనిచేసే వ్యక్తులు తమకు తెలియకుండానే సామాజిక ప్రయోజనానికి ఎలా దోహదపడతారో ఆయన వివరించారు. దీనినే తర్వాత ప్రపంచం 'ఇన్విజిబుల్ హ్యాండ్' లేదా అదృశ్య హస్తం అనే భావనగా స్వీకరించింది. ఈ సిద్ధాంతం పెట్టుబడిదారీ వ్యవస్థకు మేధోపరమైన బలాన్ని ఇచ్చింది. స్మిత్ మరో అద్భుతమైన గ్రంథాన్ని రాశారు. అదే 'ది థియరీ ఆఫ్ మోరల్ సెంటిమెంట్స్'. మోరల్ సెంటిమెంట్స్ పుస్తకాన్ని మాత్రమే మళ్లీ మళ్లీ తిరగేస్తూ, కొత్త విషయాలు చేరుస్తూ, విస్తరిస్తూ గడిపారు. చనిపోయే చివరి రోజు వరకు ఆయన ఈ పనిచేస్తూనే ఉన్నారు. నేడు ఆయనను అభిమానించే వారిలో చాలామంది ఈ పుస్తకాన్ని చదవకపోవడం ఒక చారిత్రక విషాదం. నిజానికి స్మిత్ ఆలోచనల అసలు హృదయం ఈ రచనలోనే దాగి ఉంది అనేది సత్యం. ఈ పుస్తకంలో స్మిత్ ఒక మౌలికమైన ప్రశ్న అడిగారు. మనిషి ఎందుకు ఇతరుల బాధను చూసి కదిలిపోతాడు? ఒక అపరిచితుడి కన్నీరు మనలో ఎందుకు స్పందన కలిగిస్తుంది? మనం న్యాయం కోసం ఎందుకు పోరాడతాం? ఆయన ఇచ్చిన సమాధానం చాలా సులభమైనది, అదే సమయంలో విప్లవాత్మకమైనది. మనిషిలో సహజంగా ఉన్న సానుభూతే సామాజిక జీవనానికి అసలైన మూలాధారం. ఇది ఒట్టి భావోద్వేగపు వాదన మాత్రమే కాదు.

# 1053 కిలోమీటర్ల గ్రేట్ వాల్ ఆఫ్ ఆంధ్ర

**నెల్లూరు,** : వాతావరణ మార్పుల నేపథ్యంలో తీర ప్రాంత జిల్లాలకు ఈ ఏడాది విపత్తుల ముంపు పొంచి ఉందని.. దానిని ఎదుర్కొనేందుకే గ్రేట్ గ్రీన్ వాల్ ప్రాజెక్టును కేంద్రం ప్రతిష్టాత్మకంగా ముందుకు తీసుకెళ్తోందని డీసీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా రాష్ట్రంలో విస్తరించిన 1053 కిలోమీటర్ల తీర ప్రాంతంలో ఐదు కిలోమీటర్ల వెడల్పున పచ్చదనంతో కూడిన గోడను ఏర్పాటు చేయాలని.. అదే గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అని పవన్ కళ్యాణ్ వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ పర్యావరణ పరిరక్షణ కోసం తీవ్ర స్థాయిలో కృషి చేస్తున్నారు. రాష్ట్రంలో అడవుల విస్తరణకు, పచ్చదనాన్ని పెంపొందించేందుకు ఎప్పటికప్పుడు వినూత్నంగా ఆలోచిస్తున్నారు.

సీడ్ బాల్స్‌తో అడవులను పెంచాలని నిర్ణయించిన పవన్ కళ్యాణ్.. ఇప్పుడు గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టుతో మరోసారి ముందుకొచ్చారు. తీర ప్రాంత పర్యావరణ పరిరక్షణ, కోతుల నివారణ చర్యల్లో భాగంగా ప్రతిష్టాత్మకంగా ఈ ప్రాజెక్టు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. రానున్న రెండు నెలల్లో గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టు పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించాలని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. గ్రేట్ గ్రీన్ వాల్ లక్ష్య సాధనలో భాగంగా గడిచిన రెండేళ్ల కాలంలో సాధించిన పురోగతికి జాతీయ స్థాయి గుర్తింపు లభించిందన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

# కవిత పార్టీలోకి మధ్యలో వచ్చారు.. మధ్యలో వెళ్లారు

**- నేను,నా తండ్రి టీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక సభ్యులం**

**- తండ్రి, బిడ్డను కలిపేశీదుకు తాను ఎంతోగానో ప్రయత్నించా**

**- కవిత వ్యాఖ్యలకు ఘాటుగా కౌంటరిచ్చిన మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి**

నిజామాబాద్ సెప్టెంబర్ 1 ( ప్రజా గళం ప్రతినిధి) కల్వకుంట్ల కవిత టీఆర్ఎస్ పార్టీలోకి మధ్యలో వచ్చారని, మధ్యలోనే వెళ్లారని మాజీ మంత్రి, బాల్కొండ శాసనసభ్యులు వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. నేను నా తండ్రి పార్టీ వ్యవస్థాక సభ్యులుగా కొనసాగుతున్నమని ఈ విషయాన్ని గుర్తుంచుకొని మాట్లాడాలని ప్రశాంత్ రెడ్డి హితవు పలికారు. ఈ మేరకు టీఆర్ఎస్ వ్యవస్థాపక అధినేత్రి కల్వకుంట్ల కవిత పాంచజన్య సంకల్ప సభలో చేసిన వ్యాఖ్యలకు వేముల ప్రశాంత్ రెడ్డి ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. మంగళవారం భీంగల్ మండలంలోని లింబాద్రిగుట్ట సమీపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.కవిత ను కేసీఆర్ ను కలపడానికి ప్రయత్నం చేసిన తప్ప తండ్రి బిడ్డను విడగొట్టడం అనే మాట అవాస్తవమన్నారు. పార్టీ లైను దాటిన తర్వాత కేసీఆర్ కవిత ను పార్టీ నుండి బయటకు పంపించడం జరిగిందన్నారు.నేను, నా తండ్రి వేముల సురేందర్ రెడ్డి టీఆర్ఎస్ పార్టీకి వ్యవస్థాపక సభ్యులమని 2001 తెలంగాణ ఆవిర్భావానికన్న ముందే టీఆర్ఎస్ పార్టీలో ఉన్నామన్నారు.టీఆర్ఎస్ అంటేనే ప్రశాంత్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి అంటేనే టీఆర్ఎస్ పార్టీ అని అన్నారు.కవిత మధ్యలో వచ్చింద్రు మధ్యలో పోయింద్రుకాంగ్రెస్ పార్టీతో నేను మంతనాలు చేశానని అంటున్న కవిత... ఇప్పుడు కష్ట కాలంలో కేసీఆర్ వెంట ఉన్నది నేనా కవిత నా అని ప్రశ్నించారు.అసెంబ్లీలో, అసెంబ్లీ బయట, జిల్లాలో రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నది నేనా కవితనా లక్ష్మీనరసింహస్వామి సన్నిధానంలో ఉన్న నేను కాంగ్రెస్ లో ఎవరితో మంతనాలు చేయలేదు కవిత నే కాంగ్రెస్తో మంతనాలు చేయలేదని చెప్పగలరా? అని ఆయన ప్రశ్నించారు.కవిత రహస్యంగా కాంగ్రెస్ నాయకులతో మంతనాలు చేయలేదని ప్రజల ముందు చెప్పగలరా? కల్వకుంట్ల కవిత నిరాధారణమైన ఆరోపణలు ఎవరి లాభం కోసం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు.స్వలాభం కొరకు వ్యక్తిగత ప్రతిష్టలు దెబ్బ తీసే విధంగా మాట్లాడడం కరెక్ట్ కాదని,నాపై నిరాధారమైన ఆరోపణలు చేసే నైతిక హక్కుకవితకు లేదన్నారు.మొదటినుంచి టీఆర్ఎస్ పార్టీకి వ్యవస్థాపక సభ్యులుగా ఉన్నా హరీష్ రావు,జగదీశ్వర్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, నాలాంటి వాళ్లను కవిత టార్గెట్ చేయడం వెనుక బలమైన రాజకీయ కుట్ర దాగి ఉందన్నారు.కేసీఆర్ కు సన్నిహితంగా ఉన్న వారిని కవిత టార్గెట్ చేస్తుందని,ప్రత్యక్షంగా మా నాయకత్వాన్ని బలహీనపరిచి పరోక్షంగా అధికార పార్టీకి కవిత న్యాయం చేస్తుందని వేముల ప్రశాంత్ రెడ్డి



ఆక్షేపించారు.కవిత సభలో కన్నీళ్లు పెట్టుకోవడం రాజకీయంగా సానుభూతి పొందదుకేనని అర్థం అవుతుందన్నారు.అది ఆమె విజ్ఞతకు వదిలేసున్నామని.కవిత చేసే అసత్య ఆరోపణల వల్ల కేసీఆర్ ఎంత మనోవేదనకు గురవుతున్నారో బిడ్డగా ఆమె ఆలోచించడం లేదన్నారు.తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన గొప్ప నాయకుడు కేసీఆర్ పైన కేటీఆర్, హరీష్ రావు పైన విమర్శలు చేయగా లేనిది మాపై చేయడం పెద్ద ఆశ్చర్యాన్ని కలిగించలేదన్నారు. కానీ ఆమె చేసిన వ్యాఖ్యల వల్ల తనను బాధకు గురి చేసిందన్నారు.సొంత లాభం కొరకు కవిత మాట్లాడటం పెద్ద బాధగా అనిపించలేదని,కవితను రెండుసార్లు ఎమ్మెల్సీగా చేయడంలో నా పాత్ర ఏందో కేసీఆర్ కు బాగా తెలుసని,కవిత పై మొన్నటి వరకు కేసిఆర్ బిడ్డగా గౌరవం ఉండేది నిన్నటి మాటలతో ఆ గౌరవాన్ని కవిత పోగొట్టుకుందని వేముల ప్రశాంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

## సమాజం గర్వించేలా పిల్లల్ని తీర్చిదిద్దుతాం

**-'అశోక చైల్డ్ డెవలప్మెంట్ సెంటర్'**

**ప్రారంభోత్సవంలో వైద్యుల వెల్లడి**



**నిజామాబాద్ సిటీ , సెప్టెంబర్ 1( ప్రజా గళం )**సమాజం గర్వించేలా చిన్నారులను తీర్చిదిద్దేందుకే అశోక చైల్డ్ డెవలప్మెంట్ సెంటర్' ను ప్రారంభించామని వైద్యులు వెల్లడించారు. చిన్నారుల మానసిక స్థితిని ప్రారంభ దశలోనే గుర్తించి వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు ఈ సెంటర్ ఎంతగానో దోహదపడుతుందని డాక్టర్ రాహుల్ గుల్వే. డాక్టర్ కిరణ్ కుమార్ గుల్వే, డాక్టర్ సచిన్ కుమార్ గుల్వే,లు స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని డీఎస్ చౌరస్తాలో గల రిలయన్స్ బజార్ మూడవ ఫ్లోర్లో అశోక చైల్డ్ డెవలప్మెంట్ సెంటర్'ని రూరల్ ఎస్ ఐ షరీఫ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అశోక రెహాబ్ గ్రూప్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో 22వ బ్రాంచ్ ని ప్రారంభించుకోవడం శుభ పరిణామం అన్నారు. చిన్నారుల ఎదుగుదలకు ఈ సెంటర్ ఉపయోగపడుతుందన్నారు. జిల్లా వాసులు దీన్ని సద్వినియోపరుచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వైద్యులకు అభినందనలు తెలిపారు.పిల్లల ప్రత్యేక ఎదుగుదల, థెరపీ రంగంలో హైదరాబాద్లోనే అత్యంత ఆదరణ పొందిన 'అశోక చైల్డ్ డెవలప్మెంట్ సెంటర్' తమ సేవలను నిజామాబాద్ నగరానికి విస్తరిస్తోందన్నారు . "ప్రతి బిడ్డకూ ఉత్తమమైన ఆరంభం లభించాలి" అనే నినాదంతో ఏర్పాటు చేసిన ఈ అత్యాధునిక కేంద్రం విజయవంతంగా నడవాలని ఆకాంక్షించారు.అశోక చైల్డ్ డెవలప్మెంట్ సెంటర్ వైద్యులు మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ కేంద్రాన్ని ఏర్పాటుచేయడం జరిగిందని,పిల్లల్లో ఉండే ఫాఫ్ 1 రకాల ఎదుగుదల లోపాలను ప్రారంభ దశలోనే గుర్తించి, వారిని సమాజంలో స్వతంత్రులుగా మార్చడమే ఈ కేంద్రం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ సందర్భంగా ఈ కేంద్రంలో లభించే ప్రత్యేక సేవలను వివరించారు.ఎర్లీ ఇంటర్వెన్షన్: పిల్లల సమస్యలను చిన్న వయసులోనే గుర్తించి పరిష్కరించడం జరుగుతుందన్నారు.అడ్వాన్స్ డ్ థెరపీలు: స్పీచ్ థెరపీ, బిహేవియరల్ థెరపీ ప్రత్యేక శిక్షణ.ఇస్తామన్నారు.ఎక్స్పర్ట్ ప్రొఫెషనల్స్: అనుభవజ్ఞులైన క్లినికల్ సైకాలజిస్టు, స్పీచ్ పాథాలజిస్ట పర్యవేక్షణ.చేస్తారన్నారు.చైల్డ్ సెంట్రిక్ కేర్: ప్రతి బిడ్డ అవసరానికి తగ్గట్టుగా ప్రత్యేక శ్రద్ధ వహిస్తామన్నారు.నిజామాబాద్ పరిసర ప్రాంతాల ప్రజలు ఈ సువర్ణావకాశాన్ని ఉపయోగించుకోవాలని నిర్వాహకులు కోరారు.ఈ కార్యక్రమంలో అశోక రెహాబ్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్లు డాక్టర్ నవితా రాహుల్ గుల్వే, డాక్టర్ శ్వేతా కిరణ్ కుమార్ గుల్వే, జైశీల సచిన్ గుల్వే, మేనేజ్మెంట్ ప్రీతి, సుష్మ రంజిత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు ఉజ్వల భవిష్యత్తును అందిస్తున్న స్నేహ సొసైటీ

**- అంధుల ప్రత్యేక నూతన పాఠశాల భవనాన్ని ప్రారంభించిన రూరల్ ఎమ్మెల్యే.**



**నిజామాబాద్ సిటీ సెప్టెంబర్ 1 (ప్రజాగళం )** దివ్యాంగులకు ఉజ్వల భవిష్యత్తును అందిస్తున్న స్నేహ సొసైటీ సేవలు అభినందనీయమని రూరల్ శాసనసభ్యులు రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు.నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని తారకరామనగర్ లో స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్స్ట్రక్షన్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన అంధు ల ప్రత్యేక పాఠశాల భవనాన్ని రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి మంగళవారం ప్రారంభించారు.. అనంతరం అంధుల ఆరాధ్య దైవం లూయీ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.. ఈ సందర్భంగా పాఠశాల భవనం కలియతిరిగారు.. భవనంలోని వంటగది , అంధ విద్యార్థులకు ఏ విధంగా విద్యార్థులకు బోధిస్తున్నారో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.. అదేవిధంగా అంధ విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ ఏ విధంగా ఇస్తున్నారో శిక్షకులను అడిగి తెలుసుకున్నారు.. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మామూలు విద్యార్థులకు విద్యా బోధించడం అనేది అతి కష్టమైన విషయమన్నారు. అలాంటిది 1999 నుండి అంధ విద్యార్థులను అక్కున చేర్చుకొని వారి భవిష్యత్తు తీర్చిదిద్దే దిశగా స్నేహ సొసైటీ ప్రిన్సిపాల్ జ్యోతి, కార్యదర్శి ఎస్ సిద్దయ్య, ఉపాధ్యాయ సిబ్బంది చేస్తున్న కృషి వర్ణనాతీతమన్నారు.. స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్దయ్య విశేష కృషితో విద్యార్థులు ఓపెన్ స్కూల్లో పదవ????? తరగతి వరకు పరీక్షలు రాయడం జరుగుతుందన్నారు. అయితే మామూలు విద్యార్థులతో సమానంగా ఎస్ ఎస్ సి పరీక్షలు రాసే విధంగా సహకరించాలని కోరడం వారి దివ్యాంగ విద్యార్థుల పట్ల వారికున్న శ్రద్ధ ఎలాంటిదో అర్థమవుతుందన్నారు. తన వంతు బాధ్యతగా జిల్లా కలెక్టర్, విద్యాశాఖ, ఆయా అధికారులతో పాటు తన వంతు కృషి చేస్తానని రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి హామీ ఇచ్చారు.. అలాగే ప్రభుత్వం విద్యార్థుల ఉన్నతి కోసం అన్ని రకాలుగా ప్రోత్సాహకాలు అందించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు,మోడల్ స్కూల్స్ ఇలా చాలా రకాలుగా పాఠశాలలను ఓపెన్ చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా జిల్లా సంక్షేమ అధికారిణి సౌందర్య మాట్లాడుతూ, స్నేహ సొసైటీ విద్యార్థులు వారికి అందిస్తున్న శిక్షణ ద్వారా వారు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో సైతం గుర్తింపు తెచ్చారన్నారు. ఇదే పాఠశాలలో చదువుకొని మరింత మంది దివ్యంగ, అంధ విద్యార్థులు ఉన్నతి కోసము జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ఒక భాగమైన మలేరియా శాఖలో విధులు నిర్వర్తిస్తున్న నాంపల్లి రజిని తోటి విద్యార్థుల కోసం 50 వేల విరాళం ఇచ్చే స్థాయికి ఎదిగిందశీటే ఎంత నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తున్నారో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు.. అనంతరం ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా విచ్చేసిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు దాసరి విజయనంద రావు, దారం గంగాధర్ , డాక్టర్ సవిత రాణి, సెర్ల దయానంద్, తాటి సుధాకర్ పలువురిని శాలువలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు.. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కేశ వేణు, వయోజన విద్య ఉపసంచాలకులు పురుషోత్తం, 18వ డివిజన్ కార్పొరేటర్ పసునూరి రమేష్ , నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పగంగారెడ్డి, అమృతపూర్ గంగాధర్, మూత జనార్దన్,క్యాతం హనుమండ్లు, గూడ శ్రీనివాస్ రెడ్డి, జలంధర్, కనకయ్యలు పాల్గొన్నారు. అంధు విద్యార్థుల అంధవిద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సికింద్రాబాద్ న్యూ క్లబ్ నూతన కమిటీకి ఎమ్మెల్యే శ్రీగణేష్ గారి అభినందనలు



**(నిఘా నేత్రం ప్రతినిధి) సెప్టెంబర్ 1 సికింద్రాబాద్:** సికింద్రాబాద్ న్యూ క్లబ్ నూతన అధ్యక్షుడు నోముల ప్రకాష్ రావు, కమిటీ సభ్యులు కిరణ్ కుమార్, వినయ్ కుమార్ తదితరులు పికెట్లోని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ గారి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు, కమిటీ సభ్యులను ఎమ్మెల్యే శ్రీగణేష్ హృదయపూర్వకంగా అభినందించి, న్యూ క్లబ్ మరింత అభివృద్ధి చెందాలని, సభ్యుల సంక్షేమంతో పాటు సామాజిక, క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల్లో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.న్యూ క్లబ్ అభివృద్ధికి తన పూర్తి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే శ్రీగణేష్ గారు హామీ ఇచ్చారు

# ప్రజా సమస్యలు గాలి వదిలి బీఆర్ఎస్ నేతల్ని టార్గెట్ గా పాంచ జన్య సంకల్ప సభ

**- కవితపై బీఆర్ఎస్ నేత ఫైర్**






**నిజామాబాద్ సిటీ సెప్టెంబరు 1 (ప్రజా గళం)**ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గాలి వదిలేసి బీఆర్ఎస్ నాయకులే టార్గెట్గా కవిత పాంచ జన్య సంకల్ప సభ సాగిందని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాజారాం యాదవ్ విమర్శించారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కల్వకుంట్ల కవితపై ఫైర్ అయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాంచజన్య సభలో కన్నీటికి కారణమైన వారిని వదిలేసి కేవలం బీఆర్ఎస్ పార్టీతో లబ్దిపొంది ఆ పార్టీ నేతలను విమర్శించడం ఆమెకు తగదన్నారు. ఆమెను జైలుకు పంపిన మోడీ, బండి సంజయ్, ఎంపీ ధర్మపురి అరవింద్, సీఎం రేవంత్ రెడ్డి లను ఒక్క మాట కూడా అనకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కేసు నుండి కడిగిన ముత్యం లాగా రావడానికి కృషి చేసిన వారిని తీట్టేందుకే ఈ సభ ఏర్పాటు చేసినట్లు ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రజల సంక్షేమాన్ని విస్మరించి వెయ్యి రోజులు గడిచిన అమలు కానీ హామీలతో ప్రజలను మభ్యపెడుతుంటే, అధికార పార్టీ నేతలను వదిలేసి బీఆర్ఎస్ నాయకులపై దుమ్మెత్తి పోయడం సమంజసం కాదన్నారు. ఆమెను జైలు నుంచి విడిపించేందుకు అహర్నిశలు చేసిన కేసీఆర్, హరీష్ రావు, సంతోష్ రావు, ప్రశాంత్ రెడ్డిల రాజకీయ ప్రాధాన్యతను తగ్గించే విధంగా కల్వకుంట్ల కవిత సురభి నాటకాన్ని రక్తి కట్టించిందన్నారు. ఆమె మొసలి కన్నీరును తెలంగాణ ప్రజలు నమ్మే పరిస్థితులలో లేరన్నారు. అప్పుడే చంద్రముఖిల, అప్పుడే సానుభూతి పొందేలా మాట్లాడడం చూస్తుంటే సురభి నాటకంలోని ఏకపాత్రాభినయం తలపించేలా నటించారన్నారు.కొత్త పార్టీ ఏర్పాటులో భాగంగా ఐదు హామీల గురించి చెప్పుకోవడం మంచి విషయమే గాని రాష్ట్ర ప్రజల సంక్షేమం కోరి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిన బీఆర్ఎస్ నాయకులపై విమర్శలు మానుకోవాలన్నారు. మాది బహుజన తెలంగాణ లక్ష్యమని మాట్లాడిన కవిత, నిజామాబాద్ లో బహుజన, బీసీల కోసం భవన నిర్మాణం హామీ ఇచ్చి, ఐదేండ్లు అధికారంలో ఎంపీగా ఉన్న భవన నిర్మాణం ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. ఈ విలేఖరుల సమావేశంలో మాజీ నూడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి,ధర్పల్లి మండల అధ్యక్షుడు మహిపాల్ యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పాశం కుమార్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# సీపీఎస్ అంతం ఓపిఎస్ సొంతం

**- టీజీఇ జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ లో ఉద్యోగుల నిరసన**





**నిజామాబాద్ సిటీ సెప్టెంబర్ 1 (ప్రజాగళం )**టీజీఇ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో, జిల్లా చైర్మన్ నాశెట్టి సుమన్ కుమార్ అధ్యక్షతన,సెప్టెంబర్ 1 పెన్షన్ విద్రోహదినాన్ని పురస్కరించుకొని, మంగళవారం మధ్యాహ్నం . ఐ డి ఓ సి కార్యాలయం ఆవరణలో సీపీఎస్ రద్దు చేయాలని రద్దు చేయాలని ఉద్యోగులు నిరసన చేపట్టారు. ఉద్యోగుల పెండింగ్ సమస్యలపై నల్ల బ్యాడ్జీలు ధరించి, భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి టీజీఇ జేఏసీ భాగస్వామ్య సంఘాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, టీఎన్జీవో అన్ని యూనిట్ శాఖల అధ్యక్ష కార్యదర్శులు, అన్ని శాఖల ఫోరం అధ్యక్ష కార్యదర్శులు, అన్ని శాఖల ఉద్యోగులు కాంట్రాక్టడ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, అంగన్వాడి, డి ఆర్ డి ఏ, సెర్ఫ్ ఐకేపీ ఉద్యోగులందరూ మాట్లాడుతూ, సీపీఎస్ అంతం అంశంపై సుదీర్ఘంగా చర్చించిన అనంతరం... జిల్లా చైర్మన్ నాశెట్టి సుమన్ కుమార్ మాట్లాడారు.2004 సంవత్సరం తదుపరి చేరిన ఉద్యోగులందరికీ గుదిబండల మారిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం (జూూ)అంతమై పాత పెన్షన్ విధానం అమలయ్యేంతవరకు ఈ పోరాటాన్ని ఆపేది లేదని డిమాండ్ చేస్తూ, పెండింగ్ సమస్యలపై టీజీఇ జేఏసీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10వ తేదీన ఎల్బి స్టేడియం లో ఏర్పాటుచేసిన మహాధర్నా కార్యక్రమానికి ఉద్యమ స్ఫూర్తితో తరలిరావాలని సుమన్ కుమార్ పిలుపునిచ్చారు. సీపీఎస్ అంతం – ఓ పి ఎస్ పంతం, పెండింగ్ సమస్యల పరిష్కారం కావాలని నినాదాలు చేశారు.ఈ సమావేశానికి టీజీఇ జేఏసీ భాగస్వామ్య సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు రమేష్, శ్రీకాంత్, ప్రవీణ్, జమీలుల్లా, ధర్మేందర్, పండరినాథ్, హనుమాన్లు, కృష్ణారెడ్డి, నేరెళ్ల శ్రీనివాస్ ,బీరేందర్ సింగ్, దండు స్వామి,టీఎన్జీవో జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్, రాష్ట్ర కార్యదర్శి పోల శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సతీష్, సహాధ్యక్షులు పెద్దోళ్ళ నాగరాజు, టిఎన్జీవో ఉపాధ్యక్షులు సంజీవయ్య, అతిక్ అహ్మద్, శివకుమార్, మాణిక్యం, పద్మ, సునీత, ౧.విజయలక్ష్మి, గీతారెడ్డి, మంగారెడ్డి, +.విజయలక్ష్మి, శ్రీవేణి ,నిరంజన్ గౌడ్ ,విశాల్, గంగరాజు, ప్రకాష్, సునీల్ ,స్వామి, రవి ,ఎడ్విన్ వినయ్ రాజ్, టీఎన్జీవో అన్ని యూనిట్ శాఖల అధ్యక్ష కార్యదర్శులు జ్ఞానేశ్వర్ రెడ్డి, శశికాంత్ రెడ్డి, ప్రవీణ్ రాజ్, సృజన్ కుమార్, కార్తీక్, సూర్య ప్రకాష్, మారుతి, శ్రీనివాస్, విశాల్, సాయి కుమార్ గౌడ్, నగేష్, అనురాధ మరియు అన్ని శాఖల ఉద్యోగులు మహిళా ఉద్యోగ సోదరీమణులు సీపీఎస్ ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరై సీపీఎస్ అంతం కొరకై భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జర్నలిస్టును పరామర్శించిన అయ్యప్ప ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస్



**ఆర్మూర్ సెప్టెంబర్ 1 (ప్రజాగళం)**ఆర్మూర్ పట్టణంలోని ఆంధ్రజ్యోతి విలేఖరి కలిగోట్ చిన్న ను అయ్యప్ప ఫౌండేషన్ చైర్మన్ అయ్యప్ప శ్రీనివాస్ పరామర్శించారు. మంగళవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల కలిగోట్ చిన్న అనారోగ్యానికి గురి కావడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించి ధైర్యాన్ని నూరీ పోశారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటూ అహర్నిశలు కృషి చేస్తున్న జర్నలిస్టులు అని అన్నారు. జర్నలిస్టు కుటుంబానికి అయ్యప్ప ఫౌండేషన్ ఆధ్వర్యంలో అండగా నిలుస్తామని అన్నారు. అయ్యప్ప శ్రీనివాస్ వెంబడి ఫౌండేషన్ సభ్యులు ఒడ్డన్న, చిన్నారెడ్డి, లింగం ,నరేష్ ,వజ్ర ఒడ్డన్న, మామిడిపల్లి చిన్నారెడ్డి తదితరులు ఉన్నారు.

## ఫుల్ మారథాన్ రన్ లో మెడల్స్ సాధించిన సిబ్బందిని అభినందించిన సీపీ సాయి చైతన్య




**నిజామాబాద్ క్రైమ్ సెప్టెంబర్ 1 (ప్రజాగళం )**ఫుల్ మారథాన్ రన్ లో మోడల్స్ సాధించిన సిబ్బందిని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా వారికి మోడల్స్ ను అందజేశారు. హైదరాబాద్లో ఆదివారం జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ (చీవీణజ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఫుల్ మారథాన్లో రన్,నెక్లెస్ రోడ్ నుంచి గచ్చిబౌలి స్టేడియం వరకు నిర్వహించిన 42.195 కిలోమీటర్ల ఫుల్ మారథాన్ను విజయవంతంగా పూర్తి చేసి మెడల్స్ అందుకున్నారు. మహిపాల్ 5 గంటల 05 నిమిషాల 41 సెకన్లలో, సతీష్ 5 గంటల 55 నిమిషాల్లో మారథాన్ను పూర్తి చేసిన పోలీసు కానిస్టేబుల్ లను మెడల్స్ అందజేస్తూ నిజామాబాద్ పోలీస్ కమిషనర్ వి.సాయి చైతన్య అభినందించారు.కానిస్టేబుల్ పిల్లి . మహిపాల్ ఇప్పటికే 10కి పైగా రన్నింగ్ ఈవెంట్లలో పాల్గొని తన ప్రతిభను చాటుకున్నారు. రన్నింగ్పై ఉన్న ఆసక్తితో నిరంతరం సాధన చేస్తున్న మహిపాల్, అక్టోబర్లో ఢిల్లీలో నిర్వహించనున్న వేదాంత హాఫ్ మారథాన్లో కూడా పాల్గొనడానికి సిద్ధమవుతున్నారు.వారి కృషి, పట్టుదల పోలీస్ శాఖలోని ఇతర సిబ్బందికి స్ఫూర్తిదాయకమని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య మాట్లాడుతూ హౌవిధులతో పాటు క్రీడల్లోనూ రాణించి జిల్లా పోలీస్ శాఖకు పేరు తెచ్చినందుకు సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందిస్తూ, భవిష్యత్తులో జాతీయ స్థాయి పోటీల్లో కూడా రాణించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎమ్.టి.ఓ శేఖర్ బాబు పాల్గొన్నారు.

# రేవంత్ ధీమా వెనుక...

**మహబూబ్ నగర్,** : తెలంగాణ రాజకీయ చరిత్రలో 2023 అసెంబ్లీ ఎన్నికలు ఒక మలుపు. అప్పటి వరకు పలువురు విశ్లేషకులు, రాజకీయ వర్గాలు కాంగ్రెస్ పార్టీని పూర్తిగా పక్కన పెట్టేసినట్లు చూశారు. అయితే ఆ అంచనాలన్నీ తలకిందులైపోయాయి. నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మరో మూడు పర్యాయాలు అధికారం కొనసాగుతుందనే ధీమాతో ముందుకు సాగుతోంది. 2018 నుంచి 2023 మధ్య కాలంలో జరిగిన ఉపఎన్నికల్లో బీజేపీ పెరుగుతున్న బలం స్పష్టంగా కనిపించింది. కాంగ్రెస్ అక్కడక్కడా కనిపించకపోవడంతో, అసలు పోటీ బీఆర్ఎస్, బీజేపీ మధ్యనే జరుగుతుందని చాలామంది భావించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కూడా బీజేపీని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని రాజకీయ వ్యూహాలు రచించారు. ఓట్లు చీలిపోతే మూడోసారి అధికారం సాధ్యమవుతుందని గులాబీ పార్టీ నాయకులు అంచనా వేశారు. అయితే జరిగింది వేరే. బీఆర్ఎస్‌పై ఉన్న అసంతృప్తి ఓట్లు అన్నీ ఒకే చోటకు కేంద్రీకృతమయ్యాయి. ఆ ఫలితం కాంగ్రెస్‌కు దక్కింది. ఇక్కడ రేవంత్‌రెడ్డి పాత్ర కీలకమైంది. కేసీఆర్‌కు నిజమైన ప్రత్యామ్నాయం తానేనని స్పష్టంగా చాటుకున్నారు. పార్టీలోని అనేక అగ్ర నేతలను సమన్వయం చేసుకుని, ఏకగ్రీవ నాయకత్వం ఏర్పాటు చేయడంలో విజయం సాధించారు. ఫలితంగా ప్రజల్లో విశ్వాసం పెరిగి, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. గడచిన 30 నెలలుగా ఆయన తనదైన శైలిలో పాలన సాగిస్తున్నారు. రేవంత్ రెడ్డి ప్రతి సభలోనూ, పార్టీ సమావేశాల్లోనూ కాంగ్రెస్ మరో మూడు పర్యాయాలు గెలుస్తుందని స్పష్టంగా చెబుతున్నారు. ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో కూడా 2034 వరకు తానే ఉంటానని, వారి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇది కేవలం కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసం పెంచే ప్రయత్నం మాత్రమే కాదు. దీని వెనుక దీర్ఘకాలిక రాజకీయ వ్యూహం కనిపిస్తోంది. కాంగ్రెస్‌లో సాధారణంగా వర్గపోరులు పార్టీని బలహీనపరుస్తాయి. అయితే ఏక నాయకత్వం ఉన్నప్పుడు ఆ పార్టీ అద్భుతాలు సృష్టించగలదని గత చరిత్ర చెబుతోంది. ప్రస్తుతం రేవంత్ రెడ్డి ఆ లోటును తీరుస్తున్నారని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. దీనివల్ల తెలంగాణలో కాంగ్రెస్ బలం మరింతగా పెరుగుతోంది. దేశవ్యాప్తంగా బీజేపీపై అసంతృప్తి మెల్లగా పెరుగుతున్నట్లు కనిపిస్తోంది. ఇది కాంగ్రెస్‌కు అనుకూల పరిస్థితిని సృష్టిస్తోంది. ఇండియా



కూటమిలో ప్రముఖ పాత్ర పోషిస్తున్న కాంగ్రెస్, 2029లో కేంద్రంలో అధికారం సాధించగలమని నమ్మకంతో ఉంది. దక్షిణ భారతదేశంలోనే కాంగ్రెస్ ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తోంది. తెలంగాణ, కర్ణాటక, కేరళల్లో అధికారంలో ఉండటం, తమిళనాడులో భాగస్వామ్యం ఇలాంటి అంశాలు ఆ పార్టీకి బలం చేకూరుస్తున్నాయి. యువతలో కూడా కేంద్ర ప్రభుత్వంపై అసంతృప్తి ఉందని, వారు జాతీయ స్థాయిలో బలమైన ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్‌ను ఎంచుకోవచ్చని రేవంత్ అంచనా వేస్తున్నారు. ఈ జాతీయ పరిణామాలు తెలంగాణలోని స్థానిక రాజకీయాలపై కూడా ప్రభావం చూపుతాయి. 2028 ఎన్నికల నాటికి ఈ పరిస్థితులు మరింత బలపడితే, కాంగ్రెస్‌కు మరోసారి విజయం సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయం. కాంగ్రెస్ బలం పెరుగుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. గతంలో బలమైన ప్రాంతీయ పార్టీగా నిలిచిన బీఆర్ఎస్, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉండి తన స్థానాన్ని కాపాడుకోవాల్సిన సవాలు ఎదుర్కొంటోంది. కాంగ్రెస్‌లో ఏక నాయకత్వం కొనసాగితే, ప్రాంతీయ పార్టీలకు మరిన్ని ఇబ్బందులు ఎదురవుతాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పునరాగమనం కేవలం ఒక ఎన్నికల ఫలితం మాత్రమే కాదు. బలమైన నాయకత్వం, జాతీయ పరిస్థితులు, యువత ఆకాంక్షలు కలిసి ఒక కొత్త రాజకీయ వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. రేవంత్ రెడ్డి చెబుతున్న మూడు టర్ముల లక్ష్యం నిజమవుతుందా లేదా అనేది కాలం నిర్ణయిస్తుంది. అయితే ప్రస్తుత పరిస్థితులు కాంగ్రెస్‌కు అనుకూలంగానే కనిపిస్తున్నాయి.

# కాళేశ్వరమే అజెండా

హైదరాబాద్, : తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాలు త్వరలో ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర రాజకీయం ఒక్కసారిగా తీవ్ర ఉద్రిక్తతలకు వేదికగా మారింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మొదటి నుంచి బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కె. చంద్రశేఖర్ రావు నేరుగా అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొనాలని విసురుతున్న సవాళ్లు.. ఈసారి సభలో తీవ్ర దుమారం రేపేలా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా రూ. లక్ష కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం , మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు, నిధుల వినియోగంపై జరగనున్న చర్చే ఈ సమావేశాల్లో ప్రధానాంశంగా మారనుంది. కాళేశ్వరం ప్రాజెక్టును రాజకీయంగా, పరిపాలనాపరంగా తమకు ప్రధాన ఆయుధంగా మార్చుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తుండగా, రైతుల నీటి అవసరాలను చూపుతూ ప్రభుత్వాన్ని కార్నర్ చేయాలని బీఆర్ఎస్ ప్రయత్నించింది. ఇందులో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో మేడిగడ్డ నుంచి నీళ్లను ఎత్తిపోయాలి అని చేపట్టిన నిరసనలు, క్షేత్రస్థాయి ఉద్యమాలు రాజకీయాన్ని వేడెక్కించాయి. అయితే, ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ఎల్లంపల్లి నుంచి వరద నీరు సహజంగానే తిరిగి మేడిగడ్డ వైపు ప్రవహించడం, బ్యారేజీ సాంకేతిక పరిమితులు బయటపడటంతో బీఆర్ఎస్ ఒక్కసారిగా తీవ్ర ఆత్మరక్షణలో పడింది. ఇరిగేషన్ నిపుణులు, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదికలను ముందుపెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం వేస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పడం బీఆర్ఎస్‌కు సవాలుగా మారింది. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిన పరిస్థితుల్లో నీటిని నిల్వ చేయడం లేదా పంపింగ్ చేయడం అత్యంత ప్రమాదకరమని ప్రభుత్వం వాదిస్తుంటే.. బీఆర్ఎస్ మాత్రం కేవలం పొలాలకు నీళ్లు ఇవ్వకుండా నాటకాలు ఆడుతోందని ఆరోపించింది. అయితే, వరద నీటి సహజ ప్రవాహం , ఎల్లంపల్లి బ్యాక్ వాటర్ పరిణామాలు క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ వాదనకే బలాన్ని చేకూర్చడంతో, సోషల్ మీడియాలో సైతం బీఆర్ఎస్ రక్షణ ధోరణిలో పడాల్సి వచ్చింది. ఈ వర్షాకాల సమావేశాల్లో సీఎం రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న వ్యూహం అత్యంత స్పష్టంగా ఉంది. కేసీఆర్‌ను నేరుగా అసెంబ్లీకి రప్పించడం ద్వారా, ఆయన సమక్షంలోనే కాళేశ్వరం డిజైన్ లోపాలు, పీసీ ఘోష్ కమిషన్ విచారణ పురోగతి, మరియు రాష్ట్రంపై పడిన ఆర్థిక భారాన్ని



ఎండగట్టాలని కాంగ్రెస్ భావిస్తోంది. గత సమావేశాలకు కేసీఆర్ దూరంగా ఉండటాన్ని రేవంత్ రెడ్డి రాజకీయంగా వాడుకుంటూ.. ప్రతిపక్ష నేతగా సభకు వచ్చి తమ హయాంలో జరిగిన నిర్మాణాలను సమర్థించుకోవాలని సవాల్ విసురుతున్నారు. మరోవైపు, బీఆర్ఎస్ వర్గాలు కూడా ఈ సమావేశాలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. కాళేశ్వరం అంశంలో సాంకేతిక లోపాలను సరిదిద్దకుండా ప్రభుత్వం రాజకీయం చేస్తోందని, ఆరుగాలం కష్టపడే రైతులకు సాగునీరు అందించడంలో విఫలమైందని సభలో తిప్పికొట్టేందుకు కేటీఆర్, హరీష్ రావులు వ్యూహాలు రచిస్తున్నారు. అయితే, కేసీఆర్ స్వయంగా అసెంబ్లీకి వస్తారా లేదా అనేది ఇంకా ఉత్కంఠగానే మారింది. ఒకవేళ కేసీఆర్ సభకు హాజరైతే రేవంత్-కేసీఆర్ మధ్య జరిగే ప్రత్యక్ష సభ సమరం తెలంగాణ రాజకీయ చరిత్రలోనే అత్యంత కీలకమైన ఘట్టంగా మారనుంది. ఈ వర్షాకాల సమావేశాల్లో కాళేశ్వరంపై జరిగే చర్చ ప్రజాభిప్రాయాన్ని తీవ్రంగా ప్రభావితం చేయనుంది. కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ రీ-డిజైన్ వైఫల్యం గా ప్రజల్లో శాశ్వతంగా ముద్ర వేయాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తుంటే.. కాంగ్రెస్ నిర్లక్ష్యం వల్ల ప్రాజెక్టు ఎండిపోతోంది అని నిరూపించేందుకు బీఆర్ఎస్ పోరాడుతోంది. అదే సమయంలో నిరుద్యోగ సమస్యలు సహా రాష్ట్రంలో ఉన్న అన్ని అంశాలను హైలెట్ చేయాలని బీఆర్ఎస్ ప్రయత్నించడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ అసెంబ్లీ సమావేశాలు కేవలం చట్టసభల చర్చలకే పరిమితం కాకుండా, రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయ గమనాన్ని నిర్దేశించే అత్యంత కీలక పోరాట వేదికగా మారడం ఖాయంగా కనిపిస్తోంది.

# మొక్కజొన్న ఆల్ టైమ్ రికార్డ్



అదిలాబాద్, : తెలంగాణలో రైతుల నుంచి సేకరించిన మొక్కజొన్న విక్రయాల్లో మార్క్‌ఫెడ్ ఆల్‌టైమ్ రికార్డు సృష్టించింది. ఈ-వేలం విధానం ద్వారా నిర్వహించిన టెండర్లలో చరిత్రలోనే తొలిసారిగా మద్దతు ధర కంటే ఎక్కువ ధర పలికింది. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు వ్యాపారుల సిండికేట్‌ను అడ్డుకుంటూ ఈ-వేలం నిర్వహించగా.. టన్నుకు గరిష్ఠంగా రూ.26,500 ధర లభించింది. కొనుగోలు ధర కంటే టన్నుకు సగటున రూ.1,370 లాభం రావడంపై మంత్రి తుమ్మల తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణలో రైతుల నుంచి సేకరించిన మొక్కజొన్నల విక్రయంలో మార్క్‌ఫెడ్ సరికొత్త చరిత్ర సృష్టించింది. సంస్థ చరిత్రలోనే మొదటిసారిగా ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర కంటే అత్యధిక ధర లభించి రికార్డు స్థాయి లాభాలు నమోదయ్యాయి. ఈ-వేలం విధానం ద్వారా నిర్వహించిన పారదర్శక టెండర్ల వల్ల వ్యాపారుల సిండికేట్‌కు చెక్ పడటమే కాకుండా.. మార్క్‌ఫెడ్‌కు భారీగా ఆదాయం సమకూరింది. గతంలో ప్రతి ఏటా టెండర్ల సమయంలోవ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి మద్దతు ధర కంటే చాలా తక్కువ ధరకు కొటేషన్లు వేసేవారు. అధికారుల సహకారంతో తక్కువ ధరలకే విక్రయాలు జరగడం వల్ల మార్క్‌ఫెడ్ తీవ్ర నష్టాలను చవిచూసింది. ఇప్పటికే ఈ సంస్థ రూ. 1000 కోట్ల నష్టాల్లో ఉండటంతో పాటు, మరో రూ. 2 వేల కోట్ల అప్పుల భారంతో కూరుకుపోయింది. ఈ పరిస్థితిని తీవ్రంగా పరిగణించిన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మార్క్‌ఫెడ్ అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి టెండర్ల ప్రక్రియలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. మంత్రి ఆదేశాల మేరకు సిండికేట్లకు ఎలాంటి అవకాశం లేకుండా కేవలం ఈ-వేలం ద్వారానే టెండర్లు నిర్వహించాలని నిర్ణయించారు. క్వింటాలుకు మద్దతు ధర రూ.2,400 చొప్పున, టన్నుకు కనీసం రూ.24 వేల కంటే తక్కువ ధర వస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించకూడదని కఠిన నిబంధన పెట్టారు. దీనికి అనుగుణంగా మార్క్‌ఫెడ్ యాసంగి సీజన్‌లో రైతుల నుంచి సేకరించిన 14.60 లక్షల టన్నుల మొక్కజొన్నలో 10.98 లక్షల టన్నులకు గాను జులై 31, ఆగస్టు 1, ఆగస్టు 3 తేదీల్లో మూడు విడతలుగా విజయవంతంగా ఈ-వేలం నిర్వహించింది. అనంతరం సోమవారం అధికారులు ఆ టెండర్లను సమగ్రంగా పరిశీలించి ఖరారు చేశారు. ఈ మూడు విడతల వేలంలో మొక్కజొన్నకు ఊహించని విధంగా విశేష స్పందన లభించింది. టన్నుకు గరిష్ఠ ధర రూ. 26,500 పలకగా, ఇది వేలం కనీస ధర కంటే రూ. 2,500 ఎక్కువ కావడం విశేషం. కనిష్ఠ ధర కూడా మద్దతు ధర కంటే ఎక్కువగా రూ.24,100 గా నమోదైంది. మొత్తంగా ఈ విక్రయాల్లో సగటున టన్నుకు రూ. 25,370 ధర లభించింది. దీంతో మార్క్‌ఫెడ్‌కు కొనుగోలు వెచ్చించిన సొమ్ముతో పోలిస్తే టన్నుకు సుమారు రూ. 1,370 లాభం సమకూరింది. సరైన నిర్ణయాలు, పారదర్శక విధానాల వల్ల సంస్థకు ఈ స్థాయిలో లాభాలు రావడం పట్ల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంతోషం వ్యక్తం చేశారు.

# టీ కాంగ్రెస్ లో పట్టభద్రుల ఎన్నికల వేడి



హైదరాబాద్, : తెలంగాణ రాజకీయం ప్రస్తుతం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల చుట్టూ తిరుగుతోంది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న కీలకమైన ఎన్నికలు కావడం, విద్యావంతులు, ఉద్యోగుల నాడిని ప్రతిబింబించే పోరు కావడంతో అధికార కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఇటీవల జరిగిన పార్టీ కోర్ కమిటీ సమావేశంలోనూ ఎమ్మెల్సీ ఎన్నికల సమరసన్నాహాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఏదేమైనా రెండు స్థానాల్లోనూ గెలిచి తీరాల్సిందేనని, విజయం సాధించడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని పార్టీ అధిష్టానం ముఖ్యనేతలకు స్పష్టమైన టార్గెట్ నిర్దేశించింది. అధికార పార్టీ తరపున రేసులో నిలిచి ఎమ్మెల్సీగా సభలో అడుగుపెట్టేందుకు సీనియర్లు, యువ నేతలు తీవ్రస్థాయిలో పోటీపడుతున్నారు. పోటీకి దిగేందుకు ఆశావహుల సంఖ్య భారీగా ఉండటంతో కాంగ్రెస్ అధిష్టానానికి అభ్యర్థుల ఎంపిక కత్తిమీద సాములా మారింది. మహబూబ్‌నగర్ ? హైదరాబాద్ ? రంగారెడ్డి పట్టభద్రుల స్థానానికి ఆశావహులు భారీగా ఉన్నారు. ఇక రాజధాని నగరం పరిధిలోని ఉమ్మడి మహబూబ్‌నగర్ ? హైదరాబాద్ ? రంగారెడ్డి పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు కాంగ్రెస్‌లో గట్టి పోటీ నెలకొంది. ఉపాధ్యాయ, విద్యార్థి, యువజన సంఘాల్లో పట్టున్న పలువురు ముఖ్య నేతలు తమవంతు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధిగా గుర్తింపు ఉన్న హర్ష వర్ధన్ రెడ్డి విద్యావంతుల మద్దతు తనకే ఉందనే ధీమాతో ఉన్నారు. సామ రామ్మోహన్ రెడ్డి కాంగ్రెస్ మీడియా కమిటీ చైర్మన్ గా పార్టీ వాణిని బలంగా వినిపిస్తున్నారు. ఆయన టికెట్ కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నారు. టీ శాట్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న శివసేనా రెడ్డి యువత, విద్యావంతులలో మంచి గుర్తింపు పొందారు. ఇక యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివచరణ రెడ్డి యువజన విభాగానికి ప్రాతినిధ్యం కల్పిస్తూ రేసులో ముందంజలో ఉన్నారు. వీళ్లతో పాటు పార్టీ సీనియర్ నాయకుడు గౌరీ సతీష్ తో పాటు మన్నే జీవన్ రెడ్డి కూడా టికెట్ రేసులో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. కాంగ్రెస్‌కు పట్టున్న ప్రాంతంగా భావించే నల్గొండ ? ఖమ్మం ? వరంగల్ పట్టభద్రుల స్థానానికి డిమాండ్ ఊహించని స్థాయిలో ఉంది. పార్టీలోని కీలక సీనియర్ నేతలు, ప్రజాప్రతినిధులు ఎక్కువమంది ఈ ప్రాంతం నుంచే ప్రాతినిధ్యం వహిస్తుండటంతో ఇక్కడ టికెట్ దక్కించుకోవడంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కుమారుడు గుత్తా అమిత్ రెడ్డి పేరు ఈ స్థానం నుంచి ప్రముఖంగా వినిపిస్తోంది. ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉద్యమ నేతగా పేరుపొందిన చనగాని దయాకర్ సైతం విద్యార్థి, నిరుద్యోగ వర్గాల మద్దతు తనకే ఉందంటూ పోటీలో నిలిచారు. స్టేషన్ ఘన్‌పూర్ కాంగ్రెస్ ఇన్చార్జ్ ఇందిర కూడా ఈ నియోజకవర్గం నుంచి టికెట్ ఆశిస్తున్నారు. కోర్ కమిటీ సమావేశంలో విస్తృతంగా చర్చించిన అనంతరం, విజయావకాశాలు ఉన్న నేతలనే బరిలోకి దించాలని హైకమాండ్ సూచించింది. సామాజిక సమీకరణాలు, క్షేత్రస్థాయి సమీకరణాలు, ఉద్యమ నేపథ్యం, అలాగే పట్టభద్రులలో ఉన్న ప్రజాదరణ ఆధారంగా మాత్రమే అభ్యర్థులను ఖరారు చేయాలని భావిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుల నిర్ణయంపైనే ప్రస్తుతం ఈ ఆశావహుల జాతకాలు ఆధారపడి ఉన్నాయి. ఎవరికి ఎమ్మెల్సీ టికెట్ వరిస్తుంది? అధిష్టానం ఎవరి వైపు మొగ్గు చూపుతుంది అనేది ఇప్పుడు తెలంగాణ రాజకీయ వర్గాల్లో వేడి పుట్టిస్తున్న ప్రధాన అంశం!

# స్టేడియం నుంచి 2 నుంచి 3 కోట్ల లీటర్లు

**హైదరాబాద్,** : హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో భూగర్భ జలాల వినియోగాన్ని తగ్గించేందుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. స్టేడియంలో వర్షపు నీటిని సేకరించి శుద్ధి చేసే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్‌జీటీ)కి తెలిపింది. ఈ వ్యవస్థ అమల్లోకి వస్తే ప్రతి ఏడాది 2 నుంచి 3 కోట్ల లీటర్ల వరకు వర్షపు నీటిని సేకరించి వినియోగించే అవకాశం ఉందని వెల్లడించింది. పిచ్ నిర్వహణ కోసం భూగర్భ జలాలను అధికంగా వినియోగిస్తున్నారంటూ దాఖలైన కేసులో భాగంగా హెచ్‌సీఏ జూలై 2న ఎన్‌జీటీకి స్టేటస్ రిపోర్ట్ సమర్పించింది. కొత్త రైన్‌వాటర్ హార్వెస్టింగ్, ఫిల్ట్రేషన్ వ్యవస్థ ఏర్పాటుకు అవసరమైన అనుమతులు తీసుకుని పనులు పూర్తి చేసేందుకు కొంత గడువు ఇవ్వాలని, అప్పటి వరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని ట్రైబ్యునల్‌ను కోరింది. హెచ్‌సీఏ పరిశీలిస్తున్న ప్రతిపాదన ప్రకారం.. స్టేడియంలో పడే వర్షపు నీటిని సేకరించి శుద్ధి చేసి మైదానం నిర్వహణ, తోటల సాగు, ఇతర అవసరాలకు వినియోగించనున్నారు. అదనంగా భూగర్భ జలాలను రీచార్జ్ చేసే విధంగా ఈ వ్యవస్థ పనిచేస్తుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే స్టేడియాన్ని వాటర్ పాజిటివ్‌గా మార్చే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్లు హెచ్‌సీఏ తెలిపింది. వర్షపు నీటితో పాటు మురుగునీటిని శుద్ధి చేసి మైదానం, పచ్చదనం నిర్వహణ కోసం వినియోగించే అవకాశాలను కూడా హెచ్‌సీఏ పరిశీలిస్తోంది. దీంతో భూగర్భ జలాల వినియోగం మరింత తగ్గుతుందని పేర్కొంది. ప్రస్తుతం



ఉప్పల్ స్టేడియంలో మొత్తం 8.2 లక్షల లీటర్ల నీటిని నిల్వ చేసే మూడు ట్యాంకులు ఉన్నాయి. గేట్ నంబర్-5 సమీపంలో 3.5 లక్షల లీటర్ల సామర్థ్యంతో ఒక ట్యాంకు ప్రజా అవసరాల కోసం వినియోగిస్తుండగా, 2.2 లక్షల లీటర్ల సామర్థ్యంతో మరో ట్యాంకును అగ్నిమాపక అత్యవసర అవసరాల కోసం కేటాయించారు. గేట్ నంబర్-3 వద్ద 2.5 లక్షల లీటర్ల సామర్థ్యంతో మరో ట్యాంకు సాధారణ కార్యకలాపాల కోసం ఉపయోగిస్తున్నారు.

హైదర్ అలీ అనే వ్యక్తి ఎన్‌జీటీలో దాఖలు చేసిన పిటిషన్‌లో.. క్రికెట్ మైదానాల నిర్వహణ కోసం భూగర్భ జలాలను వినియోగిస్తున్నారని, బదులుగా శుద్ధి చేసిన నీరు లేదా రైన్‌వాటర్ హార్వెస్టింగ్ వంటి ప్రత్యామ్నాయాలను ఎందుకు ఉపయోగించడం లేదని ప్రశ్నించారు. ఐపీఎల్ వంటి వాణిజ్య టోర్నీల సమయంలో కూడా భారీగా నీరు వినియోగిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ కేసులో 2021 నుంచే ఎన్‌జీటీ విచారణ కొనసాగుతోంది.

# కాంగ్రెస్, బిఆర్ఎస్ ల మధ్య క్షుద్ర పూజల పంచాయితీ

హైదరాబాద్, : నేటి కాలంలో కూడా బ్లాక్ మ్యాజిక్ నమ్ముతారా.. ఏవో శక్తులు ఉన్నాయంటే విశ్వసించాలా.. నిజంగానే.. దయ్యాలు.. ఉన్నాయా.. ఉంటే వాటికి పూజలు చేసి వశం చేసుకోవచ్చా.. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న ప్రస్తుతం పరిణామాలు దయ్యాలు.. క్షుద్ర పూజల చుట్టూ తిరుగుతున్నాయి.. ప్రస్తుతం మనం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలో ఉన్నాం. అరచేతులలో ప్రపంచం మొత్తాన్ని సులువుగా చూడగలుగుతున్నాం. ఏం జరిగిందో వెంటనే తెలుసుకోగలుగుతున్నాం. ఏం జరుగుతుందో కూడా అంచనా వేయగలుగుతున్నాం. ఇటువంటి కాలంలో క్షుద్ర పూజలు చేయడం ఏంటి.. ఎదుటివారి కీడును కోరుకునేందుకు పూజలు చేయడమేంటి.. వీటి ద్వారా అవన్నీ జరుగుతాయా.. అసలు అవన్నీ సాధ్యమేనాఇటీవల భారత రాష్ట్ర సమితి సీనియర్ నాయకుడు తన్నీరు హరీష్ రావు పుణ్యక్షేత్రాలను సందర్శించారు. తెలుగు రాష్ట్రాలలోనే కాకుండా.. ఇతర ప్రాంతాలలో ఉన్న ప్రఖ్యాతమైన క్షేత్రాలను ఆయన సందర్శించారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ ఈ క్షేత్రాలను సందర్శించడం వెనక కారణం వేరే ఉందని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు.. ముఖ్యంగా చిత్ర పూజలు చేయడానికి హరీష్ రావు వేరే ప్రాంతాలలో ఉన్న క్షేత్రాలను సందర్శించారని.. అక్కడ క్షుద్ర పూజలు కూడా చేశారని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఏకంగా విలేకరుల ముందుకు వచ్చి హరీష్ రావును తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను చూసి ఓర్వలేక క్షుద్ర పూజలు చేశారని ఆరోపించారు. భారత




రాష్ట్ర సమితి నాయకులకు క్షుద్ర పూజలు చేయడం అలవాటేనని ఆయన పేర్కొన్నారు. హరీష్ రావు ఎక్కడికి వెళ్లింది.. ఎవరిని కలిసింది.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టడానికి ఏ తరహాలో వ్యవహరించింది అంతా తెలుసని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. మరోవైపు హరీష్ రావు మీద చేస్తున్న ఆరోపణల పట్ల ఆయన వర్గం నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులకు మతిభ్రమించిందని.. ప్రజలకు ఎటువంటి మంచి పనులు చేయకపోగా.. డైవర్షన్ పాలిటిక్స్ కోసం ఇటువంటి ఆరోపణలు చేస్తున్నారని హరీష్ వర్గం నాయకులు మండిపడు తున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ నాయకులు మీద హరీష్ రావు లీగల్ నోటీసులు ఇచ్చారు. తాను క్షుద్ర పూజలు చేశానని ఆరోపిస్తున్న కాంగ్రెస్ నాయకులు క్షమాపణ చెప్పాలని.. లేకపోతే పరువు నష్టం దావా ఎదుర్కోవాల్సి ఉంటుందని హరీష్ రావు ఆ నోటీసులలో పేర్కొన్నారు. ఇటీవల కుటుంబంతో కలిసి హరీష్ రావు వివిధ పుణ్యక్షేత్రాలను సందర్శించారు.

Printed, Published, and Owned by KOKKU RAVI KUMAR Editor: KOKKU RAVI KUMAR, Praja Galam Telugu Daily, C/O: Lazaras, Flat No: 206, 2nd Floor, Produturi Apartment, Road No: 11, Gangasthan Phase-2, Goopanpally, PO:Nizamabad Rs, DIST: Nizamabad, Telanagana-503003. Printed at: Swetha Offset printers, H. No: 2-10-91 & 92, Weekly Bazar, Boi gally, Nizamabad, Telanagan-503001 Email: info.krknews.ravi@gmail.com